

ఆలమూరు చెరువు కబ్జా



చెరువులో ఓ భాగంలో కబ్జా చేసి నాటిన మామిడి చెట్లు

- రూ.40కోట్ల విలువైన భూమి స్వాహా
- 298 ఎకరాల ఆయకట్టుకు అందని సాగునీరు
- తూముల వద్దనే కబ్జాల పర్వం
- అక్కడే పంటలు, తోటల సాగు
- నిద్రావస్థలో రెవెన్యూ, మైనర్ ఇరిగేషన్ అధికారులు
- కబ్జాకోరులకు వంత పాడుతున్న రాజకీయ నాయకులు

అలనాడు రాజులు తాగు, సాగునీటి కోసం వివిధ ప్రాంతాల్లో చెరువులను తవ్వించారు. నేడు వాటిని కాపాడాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం మానేశారు. దీంతో నీళ్లతో కళకళలాడాల్సిన చెరువులు విలవిలలాడుతున్నాయి. దీనిపై ఆధారపడ్డ ఆయకట్టు రైతులు సాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. కబ్జాకోరులు కోట్లాది విలువైన భూములను స్వాధీనం చేసుకొని యథేచ్ఛగా పంటలు పండించుకుంటున్నారు. రుద్రవరం మండలంలోని ఆలమూరు చీలబోయిన చెరువు ఇందుకు తార్కాణం. రూ.40కోట్ల విలువైన భూమి స్వాహా చేశారు. దీంతో సుమారు 298 ఎకరాల ఆయకట్టుకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆలమూరు గ్రామ సమీపంలో ఉన్న చీలబోయిన చెరువు రుద్రవరం మండలం ఆలమూరు, ఆళ్లగడ్డ మండలం మిట్టపల్లె గ్రామాల రెవెన్యూ పరిధిలో ఏర్పడి ఉంది. ఇప్పటికే 160 ఎకరాల భూమి కబ్జాకు గురైంది.

రుద్రవరం, మే 23 (ఆంధ్రజ్యోతి): ఆలమూరు చీలబోయిన చెరువు కబ్జాకు గురైంది. ఇప్పుడు అక్కడ తవ్విన గుంతలు, కబ్జా చేసి సాగు చేసిన పంట పొలాలు కనిపిస్తున్నాయి. దీంతో ఈచెరువు కుచించుకుపోయింది. నీటి నిల్వ సామర్థ్యం పూర్తిగా తగ్గిపోయింది. ఇలా పురాతనమైన చెరువులో సుమారు రూ.40 కోట్లు విలువైన భూమి కబ్జాకు గురైంది. రెవెన్యూ, మైనర్ ఇరిగేషన్ అధికారులు నిద్రమత్తులో ఉన్నారు. ఈచెరువు కబ్జాకు గురవుతున్నా ఒకరిపై ఒకరు నెట్టుకోవడమే తప్ప కబ్జాను అడ్డుకున్న సందర్భాలు లేవు. రైతులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. ఇలాగే కొనసాగితే చెరువు భవిష్యత్తు తరాలవారికి చూసేందుకు కూడా కనిపించదు. ప్రభుత్వ ఆస్తులంటే అధికారులకు అంత నిర్లక్ష్యమా? కాపాడాల్సిన అధికారులే కబ్జాలకు సహకరించడం ఎంత వరకు సమంజసం. రాజకీయ నాయకులు కబ్జా చేస్తున్న వారికి వంత పాడుతున్నారు.



చెరువులో కబ్జా చేసి దున్నిన భూమి

రెండు గ్రామాల రెవెన్యూ..

ఆలమూరు గ్రామ సమీపంలో ఉన్న చీలబోయిన చెరువు రుద్రవరం మండలం ఆలమూరు, ఆళ్లగడ్డ మండలం మిట్టపల్లె గ్రామాల రెవెన్యూ పరిధిలో ఏర్పడి ఉంది. పూర్వం ఈచెరువును రెండు గ్రామాల పరిధిలో ఏర్పాటుచేశారు. రుద్రవరం మం డలం ఆలమూరు రెవెన్యూ పరిధిలో 99.47 ఎకరాలు, ఆళ్లగడ్డ మండలం మిట్టపల్లె రెవెన్యూ పరిధిలో 107.98 ఎకరాలు చెరువు విస్తీర్ణం విస్తరించి ఉంది. ఈ చెరువు కింద ఆయకట్టు భూములు 298 ఎకరాలు విస్తరించి ఉన్నాయి. . ఈ భూమి అటు మిట్టపల్లె, ఇటు ఆలమూరు గ్రామాల పరిధిలో విస్తరించి ఉంది. చెరువు కబ్జాకు గురి కావడంతో సాగునీటి నిల్వ తగ్గి ఆయకట్టుదారులకు సాగునీరు అందడం లేదు.



శిథిలమైన ఆలమూరు చీలబోయిన చెరువు

మిగిలింది 42.95 ఎకరాలు మాత్రమే

ఆలమూరు చీలబోయిన చెరువులో లోపలి విస్తీర్ణం రెండు గ్రామాల పరిధిలో 207.95 ఎకరాలు విస్తరించి ఉంది. వీటిలో సుమారు 160 ఎకరాలు భూమి కబ్జాకు గురైంది. కేవలం 42.95 ఎకరాలు మాత్రమే మిగిలింది. ఆలమూరు చీలబోయిన చెరువు రెండు అలుగులు, మూడు తూములు ఉన్నా యి. కబ్జా చేసిన భూములు తూము దగ్గరనే దున్నారు. ప్రభుత్వ ఆస్తులు కబ్జాకు గురవుతున్నా మై నర్ ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు కన్నెత్తి చూడ కపోవడం గమనార్హం. కబ్జా చేసిన భూముల్లో యథేచ్ఛగా పంటలు సాగు చేస్తున్నారు. తరచూ అన్యాక్రాంతమవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

రాబోయే రోజుల్లో..

అధికారులు ఇప్పటికైనా మేల్కొనకపోతే రాబోవురోజుల్లో చెరువు ఆనవాళ్లు కనిపించవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాగే వదిలేస్తే చెరువు గట్టు సైతం తొలగించే ప్రమాదం ఉంది. ఆలమూ రు చెరవుకు ఎంతో చరిత్ర ఉంది. అప్పట్లో సీఎంగా నారాచంద్రబాబు జన్మభూమి పథకం కింద పూడికతీత పనులను ప్రారంభించారు.

స్పందన కరువు



ఆలమూరు చీలబోయిన చెరువు కబ్జాకు గురైందని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన కరువైంది. కనీసం అధికారులు చెరువు వైపు తొంగి కూడా చూడలేదు. విలువైన చెరువును కబ్జా నుంచి కాపాడాలి. చెరువులో నీరు సమృద్ధిగా నిల్వ చేసి ఆయకట్టు రైతులకు అందిస్తే పంటలు సాగు చేసుకోవడానికి వీలుంటుంది.

- పత్తి బ్రహ్మయ్య, సాగునీటి సంఘం అధ్యక్షుడు, ఆలమూరు చీలబోయిన చెరువు

హద్దులు ఏర్పాటు చేస్తాం



రెవెన్యూ అధికారుల సర్వే చేయించి ఆలమూరు చీలబోయిన చెరువు సరిహద్దులు నిర్ణయిస్తాం. సరిహద్దు వెంట ఫెన్సింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. ఈ విషయం రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

- రఘురాముడు, ఎంఐ ఏఈ, రుద్రవరం

హింసకు గురైన మహిళలకు మెరుగైన సేవలు

కలెక్టర్ రాజకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, మే 23 (ఆంధ్రజ్యోతి) : హింసకు గురైన మహిళలకు వన్‌స్టాప్ సెంటర్ ద్వారా మెరుగైన సేవలు అందజే యాలని కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో మిషన్ శక్తి సమీకృత మహిళా సాధికారత కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ వన్‌స్టాఫ్ సెంటర్‌ను 2024ఆగస్టు 1వ తేదీన జిల్లాలో ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకు 32 కేసులు నమోద య్యాయన్నారు. కేసుల వివరాలను పూర్తిస్థాయిలో డాక్యుమెంటేషన్ చేయాలన్నారు. ఆశ్రయం పొందుతున్న మహిళలు కౌన్సెలింగ్ పొందిన అనంతరం సంబంధిత స్వస్థలాల్లో ఏ పరిస్థితుల్లో ఉన్నారన్న విషయాన్ని ఎప్పటికప్పుడు విచారిస్తూ ఉండాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఐటీడీఏ పీఓ వెంకటశివప్రసాద్, ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ తేజేశ్వరి, డీఈఓ జనార్దన్‌రెడ్డి, యువజన సంక్షేమశాఖ అధికారి వేణు గోపాల్, జిల్లా ఖజానాశాఖ అధికారి లక్ష్మీదేవి, సోషల్ వెల్ఫేర్ జిల్లా అధి కారి చింతామణి, మైనార్టీ సంక్షేమ అధికారి సబిహా పర్వీన్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ జుబేదాబేగం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నిర్మాణాలను త్వరగా పూర్తి చేయండి: కలెక్టర్

నంద్యాల నూనెపల్లె, మే 23 (ఆంధ్రజ్యోతి) : పీఎంశ్రీ పథకం కింద జిల్లాలో 40 పాఠశాలల్లో నిర్మిస్తున్న రసాయన ప్రయోగశాల, ప్లే గ్రౌండ్స్, లైబ్రరీ, కిచెన్ గార్డెన్స్ తదితర నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తిచేయాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో పీఎంశ్రీ స్కూల్స్ కింద చేపట్టిన నిర్మాణాలపై ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు సమగ్ర శిక్ష ఏపీసీ ప్రేమంత్‌కుమార్, డీఈవో జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొదటి విడత కింద 28 పాఠశాలలు, 2వ విడత కింద 12 పాఠశాలల్లో 144 పనులు మంజూరయ్యాయని, ఇప్పటివరకు పూర్తయిన నిర్మాణాలను తనిఖీ చేసి నాణ్యతను పరిశీలించాలన్నారు. పెండింగ్‌లోని నిర్మాణ పనులను జూన్ 6నాటికి పూర్తిచేయాలని ఇంజనీర్లను ఆదేశించారు. ర్యాంప్ నిర్మాణాలకు మూడు రోజులు, వర్షపు నీటి నిల్వకుంటలు, టాయ్‌లెట్స్‌ను వారం రోజుల్లో నిర్మించే అవకాశం ఉందని, నాణ్యతలో రాజీపడకుండా 15రోజుల్లో పూర్తిచేసేందుకు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని అన్నారు.


'పది' సప్లిమెంటరీ పరీక్షలకు 632 మంది గైర్హాజరు

నంద్యాల ఎడ్యుకేషన్, మే 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్రవారం నిర్వహించిన పదో తరగతి భౌతికశాస్త్రం సప్లిమెంటరీ పరీక్షకు 632 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈవో జనార్దన్‌రెడ్డి తెలిపారు. డీఈవో మాట్లాడుతూ 35 పరీక్షా కేంద్రాల్లో జరిగిన భౌతిక శాస్త్రం పరీక్షకు 2657 మంది విద్యార్థులకు గాను 2025 మంది హాజరయ్యారని, 632 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మూడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 5 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. అలాగే సార్వత్రిక విద్యాపీఠం పరీక్షల్లో(ఓపన్ స్కూల్ పరీక్షలు)భాగంగా 4 కేంద్రాల్లో నిర్వహించిన శాస్త్ర సాంకేతిక విజ్ఞానం, గృహ విజ్ఞానశాస్త్రం పరీక్షకు 214 మంది విద్యార్థులకు గాను 188మంది హాజరు కాగా 26 మంది గైర్హాజరైనట్లు వివరించారు. ఇంటర్ పరీక్షల్లో భాగంగా గణితం, చరిత్ర, వ్యాపార గణాంకశాస్త్రం పరీక్షను రెండు కేంద్రాల్లో నిర్వహించగా 115 మంది విద్యార్థులకు గానూ 105 మంది హాజరయ్యారని, 10 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

సబ్సిడీల్ కాలేదు..!



- సీడ్స్ సంస్థ, ఆర్గనైజర్ల మధ్య కుదరని సయోధ్య
- బకాయిలు చెల్లించాలంటున్న సీడ్స్ ఆర్గనైజర్లు
- రాయితీ వేరుశనగ విత్తనాల పంపిణీ ఎప్పుడో..?
- ఆందోళనలో రైతాంగం



కర్నూలు అగ్రికల్చర్, మే 23 (ఆంధ్రజ్యోతి): సబ్సిడీ విత్తనాల విషయంలో సీడ్స్ ఆర్గనైజర్లకు, ఏపీ సీడ్స్ సంస్థకు మధ్య సయోధ్య కుదరలేదు. దీంతో రాయితీ వేరుశనగ విత్తనాల పంపిణీపై గందరగోళం నెలకొంది. ఉమ్మడి జిల్లాలో ముందస్తు వర్షాలు కురుస్తుండటంతో రైతులు దుక్కి చేసుకుంటున్నారు. పంటల సాగుకు సంబంధించి విత్తనాల కోసం వారు దుకాణాల వద్ద బారులు తీరుతున్నారు. ప్రభుత్వం వచ్చే ఖరీఫ్ సీజన్‌కు ఉమ్మడి జిల్లాకు 11వేల క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను రాయితీపై అందిం చేందుకు ప్రభుత్వం వ్యవసాయ శాఖ యంత్రాంగానికి అనుమతి ఇచ్చింది. వేరుశనగ విత్తనాల పూర్తి ధర కూడా ఎంతో నిర్ణయించింది. అయితే.. సబ్సిడీ ఎంత ఇస్తుందో ప్రభుత్వం ఇంత వరకు నిర్ణయం తీసుకోకపోవడంతో ఏపీ సీడ్స్ అధికారులు రాయితీ విత్తన సేకరణ విషయంలో గందరగోళానికి గురవుతున్నారు.

గతేడాది ఇదే సమయంలో..

గతేడాది ఇదే సమయానికి రాయితీ వేరుశనగ విత్తనాల సేకరణను మొదలు పెట్టారు. ఇప్పుడు మాత్రం మే నెల ముగిసిపోతున్నా కనీసం ఒక క్వింటం వేరుశనగ విత్తనాలను కూడా సేకరించేందుకు వీల్లేని పరిస్థితులను ఏపీ సీడ్స్ సంస్థ ఎదుర్కొంటుంది. సబ్సిడీ ఎంతో నిర్ణయిస్తే గానీ తాము వేరుశనగ విత్తనాలను సిద్ధం చేసేందుకు ప్రయత్నాలు చేయలేమని వ్యాపారులు (ఆర్గనైజర్లు) తేల్చి చెబుతున్నారు. అదే విధంగా గత వైసీపీ ప్రభుత్వం గత ఏడాది ఖరీఫ్‌లో వ్యాపారుల నుంచి సేకరించిన వేరుశనగ విత్తనాలకు సంబంధించి బకాయిలు ఇప్పటి దాకా చెల్లించలేదు. రాష్ట్రం మొత్తం మీద రూ.100కోట్ల దాకా అప్పటి ప్రభుత్వం ఆర్గనైజర్లకు చెల్లించకపోవడంతో పాతబకాయిలు ఇస్తేనే వచ్చే ఖరీఫ్‌కు వేరుశనగ విత్తనాలను సిద్ధం చేస్తామని, లేకపోతే తమ వల్ల కాదని ఏపీ సీడ్స్ అధికారులకు ఆర్గనైజర్లు తేల్చి చెప్పేశారు.



వడ్డీలకు తెచ్చి విత్తనకాయలు..

దాదాపు ఏడాది గడువు తీరిపోయినా ఇంకా బకాయిలు చెల్లించకుంటే తాము ప్రస్తుతం రైతుల నుంచి నాణ్యమైన వేరుశనగ విత్తనకాయలను ఏవిదంగా కొనుగోలు చేయాలని, వడ్డీలకు తెచ్చి అప్పులు సమకూర్చుకుని విత్తనకాయలు కొనుగోలు చేసే పరిస్థితి తమవద్ద లేదని ఆర్గనైజర్లు చెబుతున్నారు. ఈ పరిస్థితుల వల్ల రైతులకు ఈ నెలాఖరులోపు రాయితీ వేరుశనగ విత్తనాలు అందించే అవకాశం లేదని వ్యవసాయ శాఖ అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం ఆర్గనైజర్లకు ఇవ్వాల్సిన బకాయిలను విడుదల చేయడంతో పాటు సబ్సిడీ ఎంత ఇస్తారో నిర్ణయం తీసుకుంటే తప్ప రాయితీ వేరుశనగ విత్తనాల పంపిణీ కనీసం జూన్ మొదటి వారానికైనా జరుగుతుందో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

త్వరలో పంపిణీ చేస్తాం

వచ్చే ఖరీఫ్‌లో రాయితీ వేరుశనగ కాయలను రైతులకు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఈ విత్తన కాయల పూర్తి ధరను ప్రభుత్వం క్వింటానికి రూ.9,300గా నిర్ణయించింది. సబ్సిడీ ఇంకా ఖరారు చేయలేదు. త్వరలోనే ప్రభుత్వం బకాయిలను త్వరలోనే విడుదల చేస్తుందని ఆశిస్తున్నాం. సబ్సిడీ మొత్తంపై కూడా నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. రైతులు ఆందోళన చెందొద్దు.

- ధనలక్ష్మి, ఏపీ సీడ్స్ మేనేజర్

ఏపీఈఏపీ సెట్‌కు 37 మంది విద్యార్థులు గైర్హాజరు

నంద్యాల ఎడ్యుకేషన్, మే 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడు పరీక్షా కేంద్రాల్లో ఇంజనీరింగ్ ప్రవేశాలకు శుక్రవారం నిర్వహించిన ఏపీ ఈఏపీసెట్ పరీక్షకు 37 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించిన మొదటి సెషన్‌లో 541 మంది విద్యార్థులకు గాను 518 మంది విద్యార్థులు హాజరుకాగా 23మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఐదు గంటల వరకు నిర్వహించిన రెండో సెషన్‌లో 543 మంది విద్యార్థులకు గానూ 529 మంది విద్యార్థులు హాజరు కాగా 14 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. రెండు సెషన్స్‌లో కలిపి 1084 మంది విద్యార్థులకు గానూ 1047 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 37మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 96.59 శాతం హాజరు నమోదైంది.

అయ్యో పాపం..!

- రైల్వే శాఖ నిర్లక్ష్యానికి పసివాడు బలి
- గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో విషాద ఘటన
- కర్నూలు నుంచి రామేశ్వరం వెళుతుండగా..



మృతిచెందిన మణికంఠ



అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రి వద్ద విలపిస్తున్న తల్లి దండ్రులు

వేసవి సెలవుల్లో పుణ్యక్షేత్రాల సందర్శనకు అమ్మానాన్న, బంధువులతో కలిసి సంబరంగా బయలుదేరాడు ఏడేళ్ల మణికంఠ. కర్నూలు నుంచి గుంతకల్లు రైల్వే స్టేషన్‌కు రాత్రికే చేరుకున్నారు. ఉదయాన్నే రైలు ఎక్కుతారు. ఆ పిల్లవాడికి ఎంత ఎంత సంబరమో..! కలలుగంటూ ప్లాట్‌ఫాంపై పడుకున్నాడు. మరో రెండు గంటలు గడిస్తే.. రైలు ఎక్కి రామేశ్వరానికి బయలుదేరేవాడు. కానీ శిథిలావస్థలో ఉన్న పైకప్పు పెచ్చులు ఊడి పసివాడి తలపై పడింది. రక్తం ధారలు కట్టింది. అమ్మానాన్న కంగారుగా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయినా ప్రయోజనం లేకపోయింది..!

(వివరాలు మెయిన్‌లో)

మామిడికాయకు జూట్ కవర్


గోపవరం సమీపంలోని తోటలో మామిడికాయలకు కవర్లు ఏర్పాటు చేసిన దృశ్యం

మహానంది, మే 23 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది అంతంత మాత్రం ఉన్న మామిడి పంట దిగబడిని కాపాడుకొనేందుకు కౌలు రైతు జూట్ బ్యాగులను ఏర్పాటు చేసుకున్నాడు. మహానంది మండలం గోపవరం సమీపంలోని 4 ఎకరాల మామిడి తోటను శిరివెళ్ళ మండలం బోయలకుంట్లకు చెందిన రైతు ఆంజనేయులు రూ. 5 లక్షలకు కౌలుకు తీసుకొన్నాడు. గత ఏడాది కన్నా దిగుబడి తక్కువ రావడంతో ఉన్న మామిడి కాయలను కాపాడు కొనేందుకు వినూత్న ప్రయోగం చేసాడు. ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ కళాశాలలో రూ.3 ప్రకారం చిన్న సైజు జూట్ కవర్‌ను కొనుగోలు చేసి ఏర్పాటు చేసాడు. దీనివల్ల మామిడి కాయను చీడపురుగుల నుండి కాపాడుకోవచ్చని అన్నాడు. రుచి, నాణ్యత గల మామిడిపండ్లను కొనుగోలు చెయ్యడానికి మామిడి పండ్ల ప్రియులు ఆసక్తి చూపుతారని రైతు తెలిపారు. సాధారణ మామిడిపండ్లు కిలో రూ వంద ఉండగా జూట్ బ్యాగు తొడిగిన కవర్లలోని పండ్లు కిలో రూ. 150 నుండి 200 వందలు పలుకుతాయని అన్నారు.

హరివిల్లు



సంధ్యవేళ హరివిల్లు చూపరులను ఆకట్టుకుంది. సాయంత్రం ఓవైపు నీలి మబ్బులు ముసురుకుంటుండగా, మరోవైపు నుంచి భానుడి ప్రకాశిస్తున్న సాయం సంధ్యవేళ దేవనకొండలో ఇంద్రధనస్సు దర్శనమిచ్చింది. దాని రంగుల అందాలు చూసి చిన్నారులు కేరింతలు కొట్టారు. ప్రకృతిలోని అద్భుతాన్ని చూసి ఆనందించారు. మరి కొంతమంది సెల్‌ఫోన్లలో ఈ దృశ్యాలను బంధించారు.
- దేవనకొండ (ఆంధ్రజ్యోతి)

మండే ఎండల్లో తుంగభద్రకు వరద


కర్నూలు సమీపంలో తుంగభద్ర నదిలో వరద ప్రవాహం

- సుంకేసుల గేట్లు ఎత్తి శ్రీశైలానికి 8,464 క్యూసెక్కులు విడుదల
- జిల్లాలో 166 శాతం అధిక వర్షపాతం నమోదు
- ముందస్తు సాగుకు సన్నద్ధం అవుతున్న రైతులు

కర్నూలు, మే 23 (ఆంధ్రజ్యోతి): ఎండాకాలంలో తుంగభద్రకు వరద చేరడంతో రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. మే ఎండల్లో ప్రజలు ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరి అవుతోంటే కర్నూలు ముంగిట భారీ వర్షాలు కురుస్తున్నాయి. రికార్డు స్థాయిలో 166 శాతం అధిక వర్షపాతం నమోదైంది. మునుపెన్నడు ఇలాంటి వర్షాలు చూడలేదని, తుంగభద్రకు ఎండాకాలంలో వరద రావడం ఇదే మొదలని కర్నూలు మండలం మునగాల గ్రామానికి చెందిన 75ఏళ్ల వృద్ధుడు నరసింహప్ప పేర్కొన్నారు. ఏడాదికి 27కార్తెలు ఉంటాయి. ప్రతి కార్తె వ్యవసాయానికి సంబంధించిన నిర్దిష్ట కాలాన్ని సూచిస్తుంది. సహజంగా కృతిక కార్తె మే 11న ప్రారంభం అవుతుంది. ఈ కార్తెలో ఎండలు అధికంగా ఉంటాయి. 39 నుంచి 42 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదు అవుతుంది. ఆ తరువాత రోహిణి కార్తె మే 25న ప్రారంభమై జూన్ 8వ తేది వరకు ఉంటుంది. ఈకార్తెలో కూడా అతి తీవ్ర ఎండలు ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు అంటున్నారు. అలాంటి మే నెలలో జిల్లాలో విస్తారంగా వర్షాలు కురవడమే కాదు.. తుంగభద్ర, హంద్రీ, వేదవతి నదులకు వరద చేరడం పాతికేళ్లలో రికార్డు అని ఇంజనీర్లు అంటున్నారు.

166 శాతం అధిక వర్షపాతం

మే నెలలో సాధారణ వర్షపాతం 29.7 మిల్లీమీటర్లు (ఎంఎం) కాగా.. ఇప్పటికే 79.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మునుపెన్నడు లేని విధంగా 166 శాతం అధిక వర్షపాతం నమోదు కావడం కొసమెరుపు. జిల్లాలో అత్యధికంగా హొళగుంద మండలంలో 35.6 మిల్లీ మీటర్ల వర్షం పడాల్సి ఉంటే.. ఇప్పటికే 159.6 మి.మీలు పడింది. హాలహర్వి మండలంలో కూడా 102 మి.మీలు వర్షపాతం నమోదు అయ్యింది. సరిహద్దులో ఉన్న వేదవతి నదికి వరద పోటెత్తడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తుంగభద్ర నదికి ఈఏడాది ముందుగా వరద చేరింది. సుంకేసుల బ్యారేజీకి శుక్రవారం 8,305 క్యూసెక్కుల వరద చేరింది. గేట్లెత్తి దిగువ శ్రీశైలం జలాశయానికి 8,464 క్యూసెక్కులు విడుదల చేశారు. మంగళ, బుధ, గురువారాల్లో 12 వేల క్యూసెక్కులకు పైగా వదిలారు. కర్నూలు నగరం శివారులో తుంగభద్ర జలకళతో ప్రకృతి ప్రేమికులను అహ్లాద పరుస్తుంది. కర్ణాటకాంధ్ర జీవనాడి తుంగభద్ర జలాశయానికి సైతం ముందస్తు వరద నమోదు అవుతుంది. 6,782 క్యూసెక్కులు వరద ఎగువ నుంచి డ్యాంకు వచ్చి చేరుతుంది. నదీ తీర గ్రామాల అవసరాల నిమిత్తం 2,082 క్యూసెక్కులు నదికి విడుదల చేస్తున్నారు. డ్యాం గరిష్ఠ నీటి మట్టం 1633 అడుగులు, పూర్తిస్థాయి నీటి మట్టం 105.788 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 1589.3 అడుగుల వద్ద 10.457 టీఎంసీలు నిల్వ ఉంది.

అత్యధికంగా వర్షపాతం నమోదైన మండలాలు.. మిల్లీ మీటర్లలో

మండలం	సాధారణ	నమోదు
నందవరం	25.2	100
కల్లూరు	30.5	128.4
కర్నూలు రూరల్	27.3	141.8
కోడుమూరు	30.9	114.8
గోనెగండ్ల	19.4	91.6
హొళగుంద	35.6	159.6
హాలహర్వి	26.9	102
పత్తికొండ	36.7	100.2
మద్దికెర	25.9	90.4
తుగ్గలి	31.1	124
కర్నూలు అర్బన్	27.3	105
జిల్లాలో పడిన వర్షం	773.3	2,059.8
జిల్లా సగటు వర్షపాతం	29.7	79.2


కర్నూలు నగరానికి అనుకొని ప్రవహిస్తున్న తుంగభద్ర జల అందాలు

104 రీజనల్ మేనేజర్‌గా షేక్ ఇక్బాల్ హుసేన్


డీఎంహెచ్‌వోను కలిసిన 104 భవ్య హెల్త్ సర్వీసెస్ రీజనల్ మేనేజర్

కర్నూలు హాస్పిటల్, మే 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా 104, అంబులెన్స్ నిర్వహణకు ప్రభుత్వం భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్ కొత్త సర్వీసు ప్రొవైడర్‌ను ఎంపిక చేసింది. ఇందులో భాగంగా జిల్లా 104 భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రొవైడర్ రీజనల్ మేనేజర్‌గా నియమితుడైన షేక్ ఇక్బాల్ హుసేన్ శుక్రవారం డీఎంహెచ్‌వో డా.పి. శాంతికళను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ 104 వాహనాల ద్వారా గ్రామీణులకు రోగ నిర్ధారణ పరీక్షలతో పాటు సేవలు అందించాలని ఆదేశించారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం: డీఈవో


విద్యార్థినికి ప్రశంసాపత్రం, షీల్డ్‌ను అందజేస్తున్న డీఈవో జనార్దన్‌రెడ్డి

నంద్యాల ఎడ్యుకేషన్, మే 23 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని డీఈవో జనార్దన్‌రెడ్డి పిలుపునిచ్చారు. నంద్యాల డీవైఈవో కార్యాలయంలో జిల్లా ఎన్‌జీసీ కోఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జీవ వైవిధ్య పోటీల్లో విజేతల బహుమతుల పంపిణీ కార్యక్రమానికి డీఈవో జనార్దన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అతిథులుగా నంద్యాల డీవైఈవో శంకర్‌ప్రసాద్, డోన్ డీవైఈవో వెంకట్రామిరెడ్డి, జిల్లా సైన్స్ అధికారి సుందర్‌రావు, జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ కేవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు. డీఈవో మాట్లాడుతూ విద్యార్థులు ప్రకృతిని ప్రేమిస్తూ మొక్కలను రక్షించి జీవ వైవిధ్యాన్ని పెంపొందించాలని సూచించారు. ప్రతి విద్యార్థికి ప్రకృతి వనరులపై అవగాహన ఉండాలన్నారు. భూమిపై ఉండే జంతు, జీవరాశులను రక్షించి తద్వారా మంచి గాలి, ఆహారం తీసుకుంటూ ఆరోగ్యంగా జీవించాలన్నారు. చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జీవవైవిధ్యానికి మూలాధారం పచ్చదనమని, అందరం కలిసి మొక్కలు నాటి వాటిని పరరక్షించి పర్యావరణాన్ని కాపాడుదామని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శేషఫణి, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో దర్శకుడు త్రినాథరావు పూజలు


మహానందిలో సినీ దర్శకుడు త్రినాథరావు

మహానంది, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ దర్శకుడు త్రినాథరావు నక్కిన శుక్రవారం మహానంది క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. రవితేజ హీరోగా నటించిన ధమాక సినిమాతోనే తనకు గుర్తింపు వచ్చిందన్నారు. నిర్మాత దిల్‌రాజు తనను ఎంతో ప్రోత్సహించారని చెప్పారు. త్వరలోనే ప్రముఖ తెలుగు హీరోతో తన దర్శకత్వంలో సినిమాను నిర్మిస్తున్నామన్నారు. పోటీ ప్రపంచంలో నెగ్గుకు రావాలంటే సరియైన ఆలోచనతో కొత్తదనం ఉండే చిత్రాలను ఎంచుకోవాలని నక్కిన తెలిపారు. అభిమానులు ఆయనతో ఫొటో దిగడానికి ఆసక్తి చూపారు.

పలువురు ప్రముఖులు..

మహానంది క్షేత్రంలో శుక్రవారం పలువురు ప్రముఖులు ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయం వద్ద వీరికి ఏఈఓ యర్రమల్ల మధు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ పసుపుల సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. వీరిలో ఏపీ ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ రాహుల్‌దేవ్‌శర్మతో పాటు నంద్యాల మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ వేర్వేరుగా ప్రధాన ఆలయాల్లో ప్రత్యేక అభిషేకార్చనలు జరిపారు. అనంతరం వీరిని కల్యాణ మంటపంలో వేదపండితులు ఆశీర్వదించి స్వామివారి ప్రసాదాలు అందచేశారు. నంద్యాల ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్, సీఐ క్రిష్ణమూర్తి పాల్గొన్నారు.

కోనేటి నిర్మాణానికి రూ.1.80 కోట్ల విరాళం

- ఘనంగా భూమి పూజ
- దాతను సన్మానించిన ఆలయ సిబ్బంది


భూమి పూజలో పాల్గొన్న భక్తుడు మంజునాథ

కౌతాళం, మే 23(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో కోనేటి నిర్మాణానికి ఓ భక్తుడు రూ.1.80కోట్లు విరాళం ఇచ్చేందుకు ముందుకు వచ్చినట్లు ఆలయ ఈవో, డిప్యూటీ కమిషనర్ విజయ రాజు తెలిపారు. శుక్రవారం కోనేటి నిర్మాణానికి దాతతో కలిసి ఆలయ అధికారులు భూమిపూజ చేపట్టారు. ఈ సందర్భంగా ఈవో విలేకరులతో మాటాడారు. కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన స్వామివారి భక్తుడు మంజునాథ కోనేటి నిర్మాణానికి అవసరమయ్యే రూ.1.80కోట్లను తాను విరాళంగా అందిస్తానని ముందుకు వచ్చారని తెలిపారు. దాతకు ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికి స్వామివారి సన్నిధిలో ప్రత్యేకపూజలు చేయించారు. స్వామి వారి తీర్థప్రసాదాలను, శాలువాతో సన్మానించి దేవుడి చిత్రపటంను అందజేశారు. ఈ సందర్భంగా దాత మంజునాథ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని తెలిపారు కార్యక్రమంలో ఆలయ ప్రధాన, ఉప ప్రధాన ముఖ్య అర్చకులు ఈరప్ప స్వామి, మహదేవప్ప స్వామి, పూజన్న స్వామి, నాగరాజు స్వామి, ఆలయ అధికారులు మల్లికార్జున, వెంకటేశ్వర్లు, వీరేష్, విజయకుమార్ ఉన్నారు.

కనీస సౌకర్యాల కల్పనే లక్ష్యం

- పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టీజీ భరత్
- రూ.12.30 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు న్యూసిటీ, మే 23(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి శూన్యమని, కూటమి ప్రభుత్వానికి కనీస సౌకర్యాల కల్పనే లక్ష్యమని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టీజీ భరత్ అన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడిచేలా కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. శుక్రవారం కర్నూలు నియోజకవర్గ పరిధిలోని 19 వార్డులలో 15వ ఆర్థిక సంఘం, ఎస్‌క్యాప్, సాధారణ నిధులకు సంబంధించి రూ.12.30 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు మంత్రి, నగర పాలక కమిషనర్ ఎస్. రవీంద్రబాబుతో కలిసి శంకుస్థాపనలు చేశారు. అశోక్‌నగర్ రైల్వే బ్రిడ్జి వద్ద సీసీ రోడ్లు, కాలువలు, కేసీ కెనాల్ బ్రిడ్జి జలమండలి వద్ద సీసీ రోడ్లు, కాలువలు, ఎస్‌ఏపీ క్యాంపు జాతీయ రహదారి వద్ద కనెక్టివిటీ రోడ్డు, నగరేశ్వరస్వామి ఆలయం వద్ద సీసీ రోడ్లు, కాలువలు, బండిమెట్ట శ్రీపొట్టిశ్రీరాములు మున్సిపల్ పాఠశాల వద్ద సీసీ రోడ్లు, కాలువలు, బుధవారపేట హంద్రీ బ్రిడ్జి వద్ద సీసీ రోడ్లు, కాలువలు, సి. క్యాంపి సెంటర్‌లో రోడ్డు, సి. క్యాంపు నుంచి బిర్లాగేట్ పోస్టాఫీసు వరకు సీసీ రోడ్డు విస్తరణ పనులకు మంత్రి టీజీ భరత్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ నగరవాసులకు ప్రధానంగా రోడ్లు, డ్రైనేజీలు, వీధిదీపాలు, వార్డుల్లో పరిశుభ్రత ఎంతో ముఖ్యమన్నారు. వీటన్నింటిని కల్పించేందకు తాను కృషి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కురువ పరమేష్, క్రాంతికుమార్, రమణమ్మ, ఇన్‌చార్జి ఎస్ఈ శేషసాయి, ఈఈ సత్యనారాయణ, డీఈఈలు క్రిష్ణలత, గంగాధర్, శ్రీనివాసరెడ్డి, వార్డు ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి కృషి

- బాధితులకు న్యాయం జరిగేలా ప్రత్యేక చర్యలు
- మానిటరీ రిలీఫ్ కింద ఆరు నెలల్లో బాధితులకు రూ.4 కోట్లు
- రాష్ట్రంలోనే అత్యధిక రిలీఫ్ ఫండ్ ఇచ్చింది కర్నూలు జిల్లా నుంచే..
- కలెక్టర్ రంజిత్ బాషా


మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు కలెక్టరేట్, మే 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి కృషి చేస్తోందని కలెక్టర్ రంజిత్ బాషా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం అమలుకు సంబంధించిన జిల్లా విజిలెన్స్ అండ్ మాని టరింగ్ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. సమావేశంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్, జిల్లా అధికారులు, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, అత్యాచార బాధిత కుటుంబాలకు త్వరి తగతిన న్యాయంజరిగి ఇతర ప్రయోజనాలను అందించేందుకు ప్రత్యేకచర్యలు తీసుకుంటు న్నామన్నారు. గత ఆరు నెలల్లో బాధిత కుటుంబాలకు మానిటరీ రిలీఫ్ కింద రూ.4 కోట్లు అందించామన్నారు. ఇంకా పెండింగ్‌లో రూ.50లక్షలు ఉందని, ఆమొత్తాన్ని కూడా త్వరగా ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోనే ఇంత ఎక్కువ మొత్తంలో మానిటరీ రిలీఫ్ ఇచ్చిన జిల్లా కర్నూలు జిల్లా అని, సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. హత్య కేసులకు సంబంధించి బాధితులకు ఇంటి స్థలం, ఉద్యోగం, త్వరితగతిన ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సబ్‌కలెక్టర్, ఆర్డీవోలను ఆదేశించారు. అలాగే ఇప్పటి వరకు 19 మందికి ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. ఎస్సీ వసతి గృహాల మరమ్మతులకు గానూ రూ.7కోట్లు మంజూరు చేశారని, అందులో దాదాపు 80శాతం పనులు పూర్తయ్యాయని, పెండింగ్ చర్యలు త్వరగా పూర్తిచేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నగరంలోని 18, 19 వార్డులలో అంగన్‌వాడీ సెంటర్ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటుమన్నామని తెలిపారు.

సభ్యులు చొరవ తీసుకోవాలి

కేసులకు సంబంధించి సోషల్‌మీడియాలో రుమర్లు వ్యాపింపచేయడంతో శాంతిభద్రతలకు భంగం వాటిల్లుతుందని, అలా చేయకుండా సభ్యులు చొరవ తీసుకో వాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. ఏదైనా సమస్య ఉంటే సమావేశం వరకు ఆగకుండా ఎస్పీ, కలెక్టర్ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించే విదంగా చర్యలు తీసుకుం టామని ఎస్పీ సూచించారు. ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్, డీఆర్వో సీ.వెంకట నారాయణమ్మ, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, పత్తికొండ ఆర్డీవో భరత్, సాంఘీక సంక్షేమ అధికారి తులసిదేవి, డీవీఎంసీ సభ్యులు రవికుమార్, సురేష్‌గౌడు, వెంకట నాగరాజు యాదవ్, మాలతి, మధు నాయక్, మద్దిలేటి, కురువ మద్దిలేటి, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు


కొవిడ్‌పై సమీక్షిస్తున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

కర్నూలు హాస్పిటల్, మే 23 (ఆంధ్రజ్యోతి): కొవిడ్ వైరస్‌పై వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కే. వెంకటేశ్వర్లు ఆదేశించారు. శుక్రవారం కడప రిమ్స్ హాస్పిటల్‌లో నంద్యాల జిల్లాకు చెందిన ఓవ్యక్తికి కరోనా పాజిటివ్ అని నిర్ధారణ కావడంతో కర్నూలు జీజీహెచ్ అధికారులు అప్రమత్తమయ్యారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) ఆదేశాల మేరకు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే. వెంకటేశ్వర్లు తన చాంబరులో కొవిడ్ వైరస్‌ను ఎదుర్కొవడానికి అనుసరించాల్సిన ప్రోటోకాల్‌పై వైద్యులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో సీఎస్ఆర్ఎంవో డా.బీవీ రావు, పల్మనాలజీ, అనస్థీషియా, మెడిసిన్, పీడియాట్రిక్, ఎమర్జెన్సీ, మెడిసిన్, మైక్రోబయాలజీ వైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఆసుపత్రిలో మాస్కులు, పీపీఈ కిట్లు, యాంటి వైరల్ డ్రగ్స్ అత్యవసర మందులు అందుబాటులో ఉండేలా డ్రగ్స్ స్టోర్ మెడికల్ ఆఫీసర్ డా. శారదను ఆదేశించారు. ఆక్సిజన్‌ను రోగులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అనస్థీషియా వైద్యులకు సూచించారు. వైద్యులతో కూడిన ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను సిద్ధం చేసుకోవాలని సంబంధిత హెచ్‌వో డీలను ఆదేశించారు. పాత గైనిక్ వార్డులో కొవిడ్ ఐసోలేషన్ వార్డును సిద్ధం చేయాలని అనస్థీషియా ప్రొఫెసర్ డా. సుధీర్‌ను ఆదేశించారు. సమీక్షలో జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ డా. ఇక్బాల్ హుశేన్, అనస్థీషియా హెచ్‌వోడీ డా. విశాల, మైక్రోబయాలజీ ప్రొఫెసర్ డా.నాగలక్ష్మి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. విజయలక్ష్మి, ఎమర్జెన్సీ మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. సుబ్రహ్మణ్యం, డా. కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

బ్రిక్స్ సమావేశాలకు బైరెడ్డి శబరికి ఆహ్వానం



నంద్యాల రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ఎంపీ, లోక్‌సభ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరికి అరుదైన అవకాశం లభించినట్లు కేంద్ర పౌరసరఫరా సభ్యుడు నరహరి విశ్వనాథరెడ్డి తెలిపారు. శుక్రవారం బ్రెజిల్‌లో జూలై 4 వ తేదీ నుంచి 6వ తేదీ వరకు జరిగే 11వ బ్రిక్స్ సమావేశాల్లో ఎంపీ పాల్గొనేందుకు ఆహ్వానం అందినట్లు పేర్కొన్నారు. బ్రిక్స్ అగ్రసదస్సుకు భారత ప్రదానమంత్రి మోదీ నాయకత్వం వహించడం గర్వకారణమన్నారు. ఎంపీగా విజయం సాధించినప్పటి నుంచి ఆస్ట్రేలియా విక్టోరియా పార్లమెంట్‌లో భారతదేశం నుంచి ప్రాతినిథ్యం వహించడం జరిగిందన్నారు. బ్రెజిల్ దేశంలో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనాలని ఆహ్వానం అందడం ఎంతో అభినందనీయమన్నారు. లోక్‌సభ స్పీకర్ ఓంప్రకాష్ బిర్లా నాయకత్వంలో రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివాన్ష్‌తో కూడిన బృందంలో ఎంపీ పాల్గొంటారన్నారు.

28న విచారణకు హాజరుకండి

కోవెలకుంట్ల, మే 23 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 28న కర్నూలు జిల్లాపరిషత్‌లో జరిగే విచారణకు హాజరుకావాలని జడ్పీ సీఈవో నాసరరెడ్డి కోవెలకుంట్ల ఎంపీపీకి నోటీసులు ఇచ్చినట్లు ఎంపీడీవో వర ప్రసాదరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత సర్వసభ్య సమావేశంలో సభ్యులు తీర్మానించి ఆమోదం పొందిన పనుల్లో ఎంపీపీ రమాదేవి కొట్టివేశారన్నారు. దీనిపై తాను జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అందులో భాగంగా ఈనెల 22న సీఈవో కోవెలకుంట్లకు వచ్చి విచారణ జరిపి రిపోర్టు తయారు చేశారన్నారు. మరలా 28న జడ్పీలో హాజరు కావాలని నోటీసులు అందించగా వాటిని ఎంపీపీకి పంపినట్లు తెలిపారు.

బదిలీలకు దరఖాస్తు చేసుకోవాలి

- జడ్పీ సీఈవో నాసరరెడ్డి

కర్నూలు న్యూసిటీ, మే 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిల్లా పరిషత్ పరిధిలోని కార్యాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది బదిలీలకు దరఖాస్తు చేసుకో వాలని జడ్పీ సీఈవో జి. నాసరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం 5 సంవత్సరాలు పూర్తి చేసిన ఉద్యోగులకు బదిలీలు చేపట్టే నిమిత్తమై మార్గదర్శకాలను అందరి కార్యాలయాల అధిపతులకు పంపించారు. సంబంధిత అధికారులు అర్హత కలిగిన ఉద్యోగుల నుంచి దరఖాస్తు ఫారాలను పూర్తి చేసి ఈ నెల 27వ తేదీ లోపల జడ్పీ కార్యాలయానికి పంపాలని పేర్కొన్నారు. 27 తరువాత వచ్చిన దరఖాస్తులను పరిగణలోకి తీసుకోమని స్పష్టం చేశారు.

పని వేళలు పాటించాలి

- ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ పోతుల శ్రీదేవి

కర్నూలు అర్బన్, మే 23 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాలు సమయ పాలన పాటించాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ పోతుల శ్రీదేవి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మద్యం దుకాణాలను ఆమె పరిశీలించి మాట్లాడారు. మద్యం దుకాణాల వద్ద పరిశుభ్రత పాటించాలన్నారు. మద్యం దుకాణాల వద్ద నిబంధనల అమలు కోసం గస్తీ బృందాలను ఏర్పాటు చేస్తున్నామని, అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సీఐలు ఆకస్మిక తనిఖీలుచేయాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు, సూపరింటెండెంట్ సుధీర్‌బాబు, సీఐలు జయరాంనాయుడు, రాజేంద్ర ప్రసాద్, దుర్గా నవీన్‌బాబు, సీఐలు, ఎస్ఐ సిబ్బంది పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

నంద్యాల టౌన్, మే 23(ఆంధ్రజ్యోతి): నంద్యాల పోన్నాపురం వద్ద రైలునుంచి జారిపడి వ్యక్తి మృతిచెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. వివరాలు.. కందుకూరు మండలం మదాపురం గ్రామానికి చెందిన మాల కొండయ్య శుక్రవారం తెల్లవారు జామున ప్రకాశం జిల్లా మార్కాపురం నుంచి గుంతకల్లుకు వెళ్తూ ప్రమాదవశాత్తు రైలు నుంచి కిందపడి చనిపోయాడు. మృతుడి కటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల జీజీహెచ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఎంవీఐపై దాడి కేసులో కర్ణాటక వాసికి రిమాండ్

ఆదోని రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఎంవీఐ కదిరి మహ్మద్ అవేస్‌పై దాడి చేసిన కేసులో కర్ణాటక వాసి చంద్రప్పకు న్యాయాధికారి 14 రిమాండ్ విధించారు. గురువారం ఎంవీఐపై దాడి చేసిన విషయం విదితమే. ఎంవీఐ ఫిర్యాదు మేరకు తాలూకా ఎస్.ఐ కేసు నమోదు చేసి శుక్రవారం ఆదోని ఫస్ట్‌క్లాస్ అడిషనల్ జెఎఫ్‌సిఎం కోర్టులో హాజరు పరచగా న్యాయాధికారి నిందితుడికి రిమాండ్ విధించారు.

ఎమ్మార్పీ కంటే ఎక్కువకు అమ్మితే చర్యలు

- సారా అమ్మకం, తయారీదారులను బైండోవర్ చేశాం
- 'నవోదయం-2.0' విజయవంతం చేయండి
- ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ



అధికారులతో మాట్లాడుతున్న రాహుల్‌దేవ్ శర్మ

నంద్యాల టౌన్, మే 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువకు అమ్మితే చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి రాహుల్‌దేవ్‌శర్మ ఆదేశించారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రోహిబిషన్ అధికారి రవికుమార్ అధ్యక్షతన జిల్లాలోని ఎస్‌హెచ్‌వోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సారాను జిల్లానుంచి సమూలంగా నిర్మూలించాలన్నారు. సారా అమ్మే, తయారు చేసేవారిపై దాడులు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వారి స్థావరాలపై దాడులు చేసి బెల్లం ఊటను ధ్వంసం చేసి బైండోవర్ చేశామన్నారు. బార్లు నియమాలను పాటించకపోయినా, సారా అమ్మినా చర్యలు తీసుకోవాలని సీఐలను హెచ్చరించారు. జిల్లాను సారా రహిత జిల్లాగా చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ప్రతి స్టేషన్ పనితీరు అడిగి తెలుసుకుని సూచనలు ఇచ్చారు. నంద్యాల జిల్లా కేంద్ర కార్యాలయాన్ని తనిఖీ చేశారు. 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర'లో భాగంగా కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. డీసీ శ్రీదేవి, అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు, అసిస్టెంట్ స్టేట్ టాస్క్‌ఫోర్స్ అధికారి మునిస్వామి, ఉమ్మడి జిల్లాల సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

మహానాడులో జిల్లాకు గుర్తింపు తేవాలి

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

కర్నూలు అర్బన్, మే 23 (ఆంధ్రజ్యోతి): కడపలో జరిగే మహానాడుకు భారీ ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తేవాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం జిల్లాస్థాయి మహానాడుకు అన్ని నియోజ కవర్గాల ఎమ్మెల్యేలు, ఇంచార్జీలు, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ధన్యవా దాలు తెలిపారు. గతంలో ఎన్నడూ లే ని విధంగా హాజరై జిల్లాలోని పార్టీ ఐక్యతను చాటడం అభినందనీయమని కొనియాడారు. ఏడు నియోజకవర్గాలతో పాటు నగరంలో 16 వార్డుల్లో పాణ్యం నియోజవర్గం ఉండటంతో పాణ్యం ఇన్‌చార్జీ కూడా హాజరై పార్టీ చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధితో పాటు ప్రతికార్యకర్తకు భరోసా ఇచ్చే విధంగా చర్చలు, తీర్మాణాలను రాష్ట్ర మహానాడుకు పంపామని పెర్కొన్నారు.

ఈతకు వెళ్లి ఇద్దరు బాలికల మృతి

- మిన్నంటిన తల్లిదండ్రుల రోదనల
- గోనెగండ్లలో విషాదం



మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

గోనెగండ్ల, మే 23(ఆంధ్రజ్యోతి): ఈతకెళ్లి ఇద్దరు బాలికలు మృతిచెందారు. ఈ ఘటన గోనెగండ్లలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన బోయ మందకల్లు, బోయ సరస్వతికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు. వీరు కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరి రెండో కుమార్తె బోయ మాధురి(12) ఆరో తరగతితో చదువు మానేసింది. అదే వీధి సమీపంలో బోయ రంగప్పనాయుడు, బోయ మహేశ్వరి లకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వీరు కూడా కూలీ పనులు చేసి జీవనం సాగించేవారు. వీరి రెండో కుమార్తె బోయ మంజుల(12) కూడా పొలం పనులకు వెళ్లేది. అయితే శుక్రవారం ఇద్దరు బాలికల తల్లులు సరస్వతి, మహేశ్వరి గ్రామానికి చెందిన కురువ నాగరాజు పొలంలో కూలీ పనులకు వెళ్లారు. బాలికలు కూడా తమ తల్లులతో పాటు పొలంకు వెళ్లారు. పత్తి విత్తనాలు విత్తే పనులు మధ్యాహ్నం ఒంటి గంట లోపు పూర్తయ్యాయి. అయితే పిల్లలద్దరు తమ తల్లులకు చెప్పకుండా నాగరాజు పొలంలో ఉన్న నీటి తొట్టిలో ఈతకెళ్లారు. ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో పడి పోయారు. ఇద్దరికి ఈత రాక పోవడంతో నీటిలో పూర్తిగా మునిగి పోయారు. వారి అరుపులు కూడా పొలంలోని వారికి వినిపించలేదు. నీటిలో ఊపిరాడక మృతి చెందారు.

ఎంత సేపటికి తమ పిల్లలు కనిపించక పోవడంతో సరస్వతి, మహేశ్వరి పొలంలో వెతికారు జాడ కనిపించ లేదు. నీటి తొట్టి వైపు వెళ్లి చూడగా అక్కడ మాధురి, మంజుల ఇద్దరు శవాలై నీటి తొట్టిలో కనిపించారు. తల్లులు రోదనలతో చుట్టుపక్కల పొలాల్లో పనిచేసే వారు అక్కడికి చేరుకొని నీటి తొట్టి నుంచి బయటకు తీశారు. అప్పటికే ఇద్దరు మృతిచెందారు. తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు రోదనలతో ఆ ప్రాంతం శోకసంద్రంగా మారింది. విషయం తెలుసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.



బోయ మాధురి(ఫైల్)



బోయ మాధురి(ఫైల్)

27న జాబ్ మేళా

కర్నూలు అర్బన్/ నంద్యాల ఎడ్యుకేషన్, మే 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో నిరుద్యోగులకు ఈనెల 27న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా అధికారి పి. సోమశేఖరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది గంటల నుంచి నేషనల్ ఐటీఐ కాలేజీ, జ్ఞానాపురం, మూల సాగరం రోడ్డు నంద్యాలలో నిర్వహించే జాబ్‌మేళాకు ఫ్లిప్ కార్టు, యంగ్ ఇండియా కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని, డెలివరీబాయ్, ట్రైనీ మేనేజర్ పోస్టులకు పదో తరగతి చదివిన విద్యార్థులు హాజరు కావాలని తెలిపారు. ఎంపికైనవారికి నెలకు రూ. 10వేల వేతనం ఉంటుందని తెలిపారు. ధ్రువపత్రాలు తీసుకుని రావాలన్నారు.

ఇద్దరు విద్యార్థులు డిబార్

కర్నూలు అర్బన్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఆర్‌యూ డిగ్రీ 4వ సెమిస్టర్ పరీక్షలో ఇద్దరు విద్యార్థులు డిబార్ అయ్యారని పరీక్షల విభాగం కంట్రోలర్ ఎస్. వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలో 7,112 మంది దరఖాస్తు చేసుకోగా 6,414 మంది హాజరై పరీక్షలు రాశారని పేర్కొన్నారు. రావుస్ డిగ్రీ కళాశాల, ఎమ్మిగనూరులో ఒకరు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కోస్గిలో ఒకరు మాసీ కాపీయింగ్ పాల్పడటంతో డిబార్ చేశామన్నారు.

'రియల్' అభివృద్ధికి ప్రోత్సాహం

- పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్
- ఘనంగా 'క్రెడాయ్' ప్రాపర్టీ అండ్ బిల్డ్‌టెక్ షో ప్రారంభం



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యే గౌరు చరిత

కర్నూలు కల్చరల్, మే 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం నగరంలోని ఎస్టీబీసీ కళాశాల క్రీడా మైదానంలో, కర్నూలు క్రెడాయ్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'క్రెడాయ్ ప్రాపర్టీ అండ్ బిల్డ్‌టెక్ షో'ను ఆయన రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి, ప్రదర్శనల్లో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్లను సందర్శించారు. మంత్రి మాట్లాడుతూ ఓర్వకల్లులో పెద్దఎత్తున పరిశ్రమలు వస్తున్నాయని, బిల్డర్లు ఎవరైనా అక్కడ స్టార్‌హోటల్‌ను నిర్మిస్తే ప్రభుత్వం అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. క్రెడాయ్ సంస్థ వారు రియల్ ఎస్టేట్‌నకు సంబంధించిన అన్నింటినీ ఈ ప్రదర్శన ద్వారా ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, నగర మేయర్ బీవై రామయ్య, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్ రవీంద్రబాబు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన 'క్రెడాయ్' ప్రాపర్టీ షో

ఎస్టీబీసీ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన క్రెడాయ్ ప్రాపర్టీ షో ఘనంగా ఆరంభమైంది. క్రెడాయ్ సంస్థ కన్వీనర్ ఎన్.శ్రీనివా సరావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న ప్రాపర్టీ ప్రదర్శనకు విశేష ఆదరణ లభిస్తోందని, ఇది తమ ఆరో ఎడిషన్ అని తెలిపారు. సామాన్య ప్రజలకు సైతం స్వంత ఆస్తిని చేకూ ర్చాలనే లక్ష్యంగా క్రెడాయ్ సంస్థ పనిచేస్తోందన్నారు. క్రెడాయ్ ప్రెసిడెంట్ సురేష్‌కుమార్‌రెడ్డి ఇంటి స్థలాలు, ఇళ్లు, ప్లాట్లు వంటివి విక్రయించడమే కాకుండా అందుకు కావాల్సిన సహకారం అందించే నిర్మాణ సంస్థలు, ఇంటీరియర్స్, బిల్డింగ్ మెటీరియల్ సప్లయర్స్, బ్యాంకింగ్ రంగ సంస్థలు ఈ ప్రదర్శనలో ఉన్నాయని అన్నారు. క్రెడాయ్ చైర్మన్ గోరంట్ల రమణ బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ఇక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్ ద్వారా ప్రజలకు అవస రమైన రుణాలను ఆకర్షణీయమైన ఈఎంఐ చెల్లింపు పద్ధతిలో అందించుటకు ముందుకు వచ్చాయని తెలిపారు. స్టాల్స్ సందర్శకులను బాగా ఆకర్షించాయని క్రెడాయ్ కోశాధికారి టీవీ ప్రకాష్ తెలిపారు. ఈ షోకు విచ్చేసిన అతిథులకు క్రెడాయ్ సంస్థ కార్యదర్శి పి. గోవర్ధనరెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

కాపు, బీసీ భవన నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ

కర్నూలు ఎడ్యుకేషన్, మే 23 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలోని బీ క్యాంపులో అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న కాపు, బీసీ భవన నిర్మాణ పనులను శుక్రవారం బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సత్యనారాయణ పరిశీలించారు. ఈ పనులను 2018 ఏప్రిల్ 11వ తేదీన బీసీ కాపు భవన నిర్మాణ పనులకు అప్పటి ఉప ముఖ్యమంత్రి, రెవెన్యూ స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి కేఈ కృష్ణమూర్తి శంకుస్థాపన చేశారు. అప్పట్లో భవన నిర్మాణ పనులు కూడా చురుగ్గా సాగాయి. 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత భవన నిర్మాణ పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. నిర్మాణానికి అవసరమయ్యే నిధులను విడుదల చేయలేదు. దీంతో భవన నిర్మాణం సంబంధించిన కడ్డీలు తుప్పు పడుతున్నాయి. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సత్యనారాయణ ఈ భవన నిర్మాణాలకు అవసర మయ్యే నిధుల మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తానని తెలిపారు. ఆయన వెంట బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జాకీర్ హుశేన్ తదితరులు ఉన్నారు.

పోలీసు కస్టడీలో గుమ్మనూరు నారాయణ

- చిప్పగిరి పోలీస్‌స్టేషన్‌లో విచారించిన పోలీసులు
- తిరిగి కర్నూలు సబ్‌జైలుకు తరలింపు

ఆలూరు, మే 23(ఆంధ్రజ్యోతి): ఆలూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చిప్పగిరి లక్ష్మీనారాయణ హత్య కేసులో ఆలూరు మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్, గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు గుమ్మనూరు నారాయణను విచారణ కోసం న్యాయవాది పర్యవేక్షణలో పోలీసులు కర్నూలు సబ్‌జైలు నుంచి గురువారం కస్టడీలోకి తీసుకున్నారు. చిప్పగిరి పోలీస్ స్టేషన్‌లో అడిషనల్ ఎస్పీ హుసేన్‌పీర, పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య, ఆలూరు సీఐ రవిశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో హత్య కేసుపై విచారణ జరిపారు. శుక్రవారం మధ్యాహ్నం ఆలూరు కోర్టులో ప్రవేశపెట్టి తిరిగి కర్నూలు సబ్ జైలుకు తరలించారు. కాంగ్రెస్ నేత లక్ష్మీనారాయణ హత్య కేసులో టీడీపీ నేత గుమ్మనూరు నారాయణ ఈనెల 13న అరెస్టు అయి రిమాండ్‌లో ఉన్నాడు.

క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్టు



నిందితులను చూపుతున్న డీఎస్పీ ప్రమోద్

ఆళ్లగడ్డ మే 23(ఆంధ్రజ్యోతి): చాగలమర్రి పట్టణంలో శుక్రవారం సాయంత్రం ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ ముఠాను అరెస్టు చేసి వారి నుంచి రూ 2.06 లక్షలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ తెలిపారు. ఆళ్లగడ్డ డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి నిందితుల అరెస్టును చూపించారు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వర్సెస్ సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య జరుగుతున్న ఐపీఎల్ మ్యాచ్‌పై చాగలమర్రి లోని మల్లెవేముల రస్తాలో యువకులు బెట్టింగ్ ఆడుతున్నారని సమాచారం అందడంతో దాడి చేశారు. వీరి నుంచి నాలుగు సెల్‌ఫోన్‌లు, స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు. బెట్టింగ్ రాయుళ్లు ఖాజీమహమ్మద్ రఫి, మద్దులేటిరెడ్డి, చాకలి హరికృష్ణ, బాబాఫకృద్దీన్, షేక్ షరీఫ్ అనే వ్యక్తులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి, చాగలమర్రి ఎస్ఐ సురేష్ నాయకుడు పాల్గొన్నారు.

కరోనా కలకలం

- అప్రమత్తమైన జిల్లా వైద్య యంత్రాంగం
- పాజిటివ్ లేదని వైద్యుల నిర్ధారణ

నంద్యాల హాస్పటల్/చాగలమర్రి, మే 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కరోనా పాజిటివ్ కేసు అంటూ సోషల్ మీడియాలో కలకలం రేగింది. దీంతో వైద్య యంత్రాంగం అప్రమత్తమైంది. నంద్యాల జిల్లాలోని చాగలమర్రికి చెందిన షేక్ గౌస్‌మోదిన్‌బీ అనే వృద్ధురాలు జలుబు, దగ్గు, జ్వరంతో బాధపడుతూ కడప జిల్లాలోని ప్రొద్దుటూరులో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స కోసం వెళ్లింది. అక్కడి వైద్యులు కడప జీజీహెచ్‌కు వెళ్లమని చెప్పారు. కడప జీజీహెచ్‌లో చికిత్సపొందు తున్న ఆమెను కరోనా వార్డులో ఉంచారు. దీన్ని కరోనా సోకిందంటూ వైరల్ అయింది. చాగలమర్రిలోని వృద్ధురాలి ఇంటికి వైద్యబృందం వెళ్లి పరిసర ప్రాంత ప్రజలతో జబ్బుల గురించి తెలుసు కున్నారు. ఆమె కుటుంబంలోని వారికి ఏదైనా వైద్య సమస్యలు ఉన్నాయా అని పరిశీలించారు. ఎలాంటి వైద్యసమస్యలు లేకపోవడంతో వైద్య యంత్రాంగం ఊపిరిపీల్చుకుంది.

ప్రజలు భయపడాల్సిన అవసరం లేదు

చాగలమర్రికి చెందిన వృద్ధురాలు కరోనా పాజిటివ్ అంటూ వచ్చిన సమాచారాన్ని జిల్లా వైద్యాధికారి కొట్టి పారేశారు. కరోనా పరీక్షలు నిర్వహించేందుకు కిట్‌లు లేనపుడు ఎలా నిర్ధారణ అవుతుందన్నారు. జిల్లాలో ఎలాంటి కరోనా కేసులు లేవు, ప్రజలు భయపడాల్సిన అవసరంలేదు. చాగలమర్రిలో వృద్ధురాలి నివాస పరిస రాలను వైద్య బృందం పూర్తిగా పరిశీలించారు. వృద్ధురాలి కుటుంబంలో ఆరుగురు సభ్యులకు ఎలాంటి కరోనా లక్షణాలు లేవని నిర్ధారించారు.

- డా.వెంకటరమణ, డీఎంహెచ్‌వో, నంద్యాల

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

- కేసుల దర్యాప్తుపై డీఎస్పీలు దృష్టిసారించాలి
- సైబర్ నేరాల నివారణపై అవగాహన కల్పించాలి
- నేర సమీక్షలో ఎస్పీ విక్రాంత్ పాటిల్



పాల్గొన్న పోలీసు అధికారులు, ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న ఎస్పీ

కర్నూలు క్రైం, మే 23 (ఆంధ్రజ్యోతి): పోలీసు అధికారులు విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎస్పీ విక్రాంత్ పాటిల్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కర్నూలు, పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరు సబ్ డివిజన్‌లో దీర్ఘకాలికంగా ఉన్న పెండింగ్ కేసులపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ కేసుల దర్యాప్తులపై డీఎస్పీలు దృష్టి సారించాలన్నారు. నేరాల నివారణే ప్రథమ కర్తవ్యంగా పనిచేయాలన్నారు. డాబాల్లో మద్యం, ఓపెన్ డ్రింకింగ్, పేకాట వంటి వాటిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహిస్తే స్పెషల్ టీమ్స్ రంగంలోకి దిగి దాడులు చేస్తాయన్నారు. పెండింగ్ కేసులు తగ్గించాలన్నారు. మెజిస్ట్రేట్‌లను కలిసి పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పెండింగ్ కేసుల్లో నిందితుల అరెస్టు గురించి ఆరాతీసి శిక్షలు పడేలా చేసి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేసుల దర్యాప్తుల పై డీఎస్పీ స్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించాలని, రోడ్డు ప్రమాదాలు జరగకుండా హైవే పెట్రోలింగ్ పోలీసులు బాగా పని చేయాలన్నారు. పోలీసు అధికారులు గ్రామాల పర్యటనకు వెళ్లినప్పుడు రోడ్డు ప్రమాదాల మలుపులు, ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి రేడియం స్టిక్కర్లు, బారికేడ్లు, బ్లింకర్స్, స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. డ్రంకెన్ డ్రైవ్‌లు, మిస్సింగ్ కేసులను ఛేదించాలన్నారు. అనంతరం గత నెలలో వివిధ కేసులలో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. డీఎస్పీలు బాబు ప్రసాద్, ఉపేంద్రబాబు, హేమలత, ఏఆర్‌డీ ఎస్పీ బాస్కర్‌రావు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

యోగాతో ఆరోగ్యం

● అడిషనల్ ఎస్పీ చంద్రబాబు



యోగా చేస్తున్న పోలీసులు

నంద్యాల టౌన్, మే 23(ఆంధ్రజ్యోతి): ప్రతిరోజూ యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా ఉండొచ్చునని అడిషనల్ ఎస్పీ చంద్రబాబు అన్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయ మైదానంలో సాయుధ బలగాలతో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమం తప్పకుండా తీసుకునే ఆహారం లాగానే యోగాను మన దినచర్యలో భాగం చేసుకోవాలని అన్నారు. యోగా చేయడం వల్ల చాలా ఉపయోగాలు ఉన్నాయన్నారు. దైనందిత జీవితంలో యోగాతో ఎన్నో మార్పులు వస్తాయన్నారు. కార్యక్రమంలో సీఐలు ఈశ్వరయ్య, మంజునాథ్ సిబ్బంది పాల్గొన్నారు.

వడ దెబ్బ సోకకుండా జాగ్రత్తగా ఉండాలి



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీహెచ్ఈవో ఉసేన్‌రెడ్డి

మహానంది, మే 23 (ఆంధ్రజ్యోతి): వేసవికాలంలో వడదెబ్బ సోకకుండా ఉపాధిహామీ కూలీలు జాగ్రత్తగా ఉండాలని ఎంపీహెచ్ఈవో ఉసేన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మహానంది సమీపంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు ఎంపీహెచ్ఈవో అవగాహన కల్పించారు. ఓఆర్ఎస్ ద్రవం తప్పని సరిగా ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం భార్గవి, విజయ, ఎల్లయ్య పాల్గొన్నారు.

సదస్సును జయప్రదం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు, మే 23(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాదుల దాడి నేపథ్యంలో చోటు చేసుకున్న పరిణామాలపై ఈ నెల 26న స్థానిక థెరిసా జూనియర్ కళాశాలలో జరిగే సదస్సును జయప్రదం చేయాలని సీపీఎం నాయకులు ఏసురత్నం, రణధీర్, వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఉగ్రవాద వ్యతిరేక పోరాటమా..? అమెరికాకు లొంగుబాటా..? మతసా మరస్యం దేశసమగ్రత పరిరక్షణపై సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సదస్సుకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ప్రభాకరరెడ్డి రానున్న ట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. నాయకులు రామ్‌నాయక్, వీరన్న, మాబాషా పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

పాములపాడు, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టకందాల గ్రామంలో సుంకుల పరమేశ్వరి, జమ్ముల పరమేశ్వరి దేవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు శుక్రవారం నిర్వహించారు. గత నెల 12న గ్రామంలో అమ్మవార్ల నూతన ఆలయాలు, విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారికి బోనాలు సమర్పించారు.

మెరుగైన వసతులు కల్పించండి: కలెక్టర్

నంద్యాల నూనెపల్లె, మే 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్లలో ప్రయాణికులు ఇబ్బందులుపడకుండా మెరుగైన వసతులు కల్పించాలని కలెక్టర్ రాజకుమారి డిపో మేనేజర్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్ నుంచి జిల్లాలోని ఏపీఎస్ ఆర్టీసీ డిపో మేనేజర్లతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వసతుల కల్పనపై సమీక్షించారు. ప్రతిరోజు దాదాపు 1.20లక్షలమంది ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారని, ప్రయాణికులకు తగ్గట్టుగా వసతులను ఏర్పాటు చేయాలని డీపీటీవో, డీఐఎంఎస్‌లను ఆదేశించారు. ప్రతి బస్టాండ్ ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని తాగునీరు, టాయ్‌లెట్ల సౌకర్యం కల్పించాలన్నారు. నిరుపయోగంగా ఉన్న వ్యక్తిగత మరుగుదొడ్లకు మరమ్మతులు చేయించాలన్నారు. సమావేశంలో నంద్యాల జిల్లా ఆర్టీసీ ఆర్ఎం రజియాసుల్తానా, డిపో అధికారి నిర్మల పాల్గొన్నారు.

నూతన భవనంలోకి మార్చాలి



జిల్లా రిజిస్ట్రార్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

నంద్యాల రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): డోన్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని నూతనంగా నిర్మించిన భవనంలోకి మార్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం నంద్యాల జిల్లా రిజిస్ట్రార్ పీవీఎన్ బాబుకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సౌకర్యవంతంగా షాదీఖానా సమీపంలో నిర్మించిన నూతన భవనంలోకి మార్చాలన్నారు. స్థానిక రాజకీయ విభేదాల వల్ల డోన్ పట్టణ శివారులో ఉన్న భవనంలోకి మార్చాలని చూస్తున్నారని నూతనంగా రూకోటితో నిర్మించిన భవనంలోకి మార్చాలని డిమాండ్ చేశారు. రాజకీయ లబ్ధి కోసం ప్రజలకు ఇబ్బంది కలిగించే పద్ధతి మార్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, డోన్ పట్టణ కార్యదర్శి మోటారాముడు, ఏఐటీయూసీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, బి. శ్రీనివాసులు, కరీం తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య



ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

కొత్తపల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టామని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. శుక్రవారం కొత్తపల్లి భ్రమరాంబ చెంచుగూడెంలో స్థానిక సర్పంచ్ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జల్‌జీవన్ మిషన్ కింద రూ.72 లక్షల నిధులతో చేపట్టనున్న 90వేల లీటర్ల ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు నిర్మాణం కోసం భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే మండలంలోని అన్ని గ్రామాల్లో జలజీవన్ మిషన్ కింద పైపులైన్ నిర్మాణం, ట్యాంకుల ఏర్పాటు కోసం నిధులు మంజూరైనట్లు చెప్పారు.

● గ్రీవెన్స్‌లో వచ్చిన ప్రతి అర్జీని పరిష్కరిస్తాం

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ప్రతి అర్జీని పరిష్కరిస్తామని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తాజయసూర్య అన్నారు. శుక్రవారం కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న అధ్యక్షతన నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2019-24 వైసీపీ ప్రభుత్వ హయాంలో పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేశారని ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్తపల్లి మండలంలో ఇప్పటికే అన్ని గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం పనులు పూర్తి చేశామన్నారు. గ్రామాల్లో వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. జడ్‌వారిపల్లి, సంగమేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీరు అందిస్తామని అన్నారు. ఎన్ఆర్ఈజీఎస్‌లో మండలంలో ఎన్నో అవకతవకలు జరిగాయని తమ దృష్టికి వచ్చిందని, త్వరలో క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలోని అన్ని చెరువులకు మరమ్మతులు చేపట్టేందుకు ఇప్పటికే ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. త్వరలోనే కొత్తపల్లి మండలం మీదుగా ఎన్‌హెచ్-167కే రహదారి నిర్మాణ పనులు మొదలవుతాయనీ, ఇది పూర్తయితే సంగమేశ్వరం, కొలనుభారతి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో ఎంపీడీవో మేరీ, డీటీ అరుణ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసరెడ్డి, ఏఈ జుబేర్, పీఆర్ ఏఈ మద్దిలేటి, ఏపీఎం పుల్లయ్య, ఏసీడీపీవో మంగవల్లి, ఏవో మహేష్, ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్ కుమార్ రెడ్డి, స్థానిక ఎస్ఐ జయశేఖర్‌లతో పాటు ఆయా గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చాలి

● లేదంటే ఐక్య పోరాటాలకు సిద్ధం
● వామపక్ష నాయకులు



మాట్లాడుతున్న వామపక్ష నాయకులు

నందికొట్కూరు, మే 23(ఆంధ్రజ్యోతి): మిడ్తూరు మండలంలోని మెట్ట భూములకు సాగునీరు అందించే విధంగా నూతన ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేయాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ కార్యాల యంలో వామపక్ష పార్టీలు ఎంసీపీఐయూ, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ , సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ, సీపీయూఎస్ఐ ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు ప్రాతకోట లాజరస్, పిక్కిలి వెంకటేశ్వర్లు, ఎస్.ఎం.డీ. రఫీ, రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతాంగ సమస్యలను గాలికి వదిలేసిందన్నారు. ప్రభుత్వాలు, ఎమ్మెల్యేలు మారుతున్నా మిడ్తూరు ఎత్తిపోతల పథకం మాత్రం పురుడు పోసుకోవడం లేదన్నారు. గత ఎన్నికల ముందు టీడీపీ ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు కార్యారూపం దాల్చేంత వరకు ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నవీన్ కుమార్, వేల్పుల ఏసన్న, నరసింహులు పాల్గొన్నారు.

ఎండీయూ వ్యవస్థను కొనసాగించాలి



ధర్నా చేస్తున్న ఎండీయూ వాహనాల ఆపరేటర్లు

నంద్యాల నూనెపల్లె, మే 23(ఆంధ్రజ్యోతి): రేషన్ పంపిణీకి సంబంధించి ఎండీయూ వాహనాల ద్వారానే కొనసాగించాలని ఎండీయూ ఆపరేటర్ల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖాజా డిమాండ్ చేశారు. జూన్ ఒకటి నుంచి ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ వ్యవస్థను రద్దుచేయడంతో ఆ వాహనాల ఆపరేటర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. శుక్రవారం నంద్యాలలోని సీపీఎం కార్యాలయం నుంచి సాయిబాబానగర్, పద్మావతినగర్, మున్సిపల్ కార్యాలయం, బొమ్మలసత్రం మీదుగా ఎండీయూ వాహనాలతో ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తోటమద్దులు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, మహమ్మద్‌గౌస్ మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో బ్యాంకుల నుంచి రుణాలు పొంది వాహనాలు తీసుకుని ప్రతినెలా ఈఎంఐలు చెల్లిస్తూ ఇంటింటికి వెళ్లి బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. అర్ధాంతరంగా ఎండీయూ వ్యవస్థను తొలగించడం ప్రభుత్వానికి తగదన్నారు. దాదాపు 10వేలమంది కార్మికులు వీధిన పడాల్సి వస్తోందన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన తప్పులను సవరించి మరింత పటిష్ఠంగా పంపిణీ వ్యవస్థను తమద్వారానే కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉండటంతో ప్రభుత్వం నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. అనంతరం డీఆర్వో రామునాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, ఎండీయూ ఆపరేటర్లు పాల్గొన్నారు.

రైతులు దరఖాస్తు చేసుకోవాలి



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఏవో

వెలుగోడు, మే 23(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ కోసం రైతులు ఈ నెలఖారులోగా దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి పవన్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన వ్యవసాయశాఖ కార్యాలయంలో రైతుసేవా సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

మురుగు సమస్యను త్వరలో పరిష్కరిస్తాం



గురుకుల బాలుర పాఠశాలలో మురుగును పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో

పాణ్యం, మే 23 (ఆంధ్రజ్యోతి) : పాణ్యం ఏపీ గురుకుల పాఠశాల మురుగు సమస్యను త్వరలో పరిష్కరిస్తామని శ్రీశైలం ఐటీడీఏ పీవో వెంకటశివప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆయన గురుకుల బాలుర పాఠశాలను తనిఖీ చేశారు. ఏళ్లుగా విద్యార్థులు ఎదుర్కొంటున్న మురుగు కాల్వ సమస్యను పరిశీలించారు. పాఠశాల నుంచి వెలువడే మురుగునీరు ఎక్కడికి వెళ్లాలో తెలియని పరిస్థితి నెలకొందని, పాఠశాల సమీపంలోని ఇళ్ల స్థలాల యజమానులు మురుగు కాల్వ నిర్మాణానికి అడ్డు చెప్పడంతో తీవ్ర ఇబ్బంది ఏర్పడిందని పాఠశాల యాజమాన్యం పీవో దృష్టికి తీసుకువచ్చారు. పలు మార్లు అధికారులు, ప్రజాప్ర తినిధుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీంతో పీవో మాట్లాడుతూ మురుగు సమస్యను పరిష్కరించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణా నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

దేవాలయ భూములకు కౌలు వేలం

45.95 ఎకరాలకు సంవత్సరానికి రూ.5.7 లక్షలు కౌలు



వేలం నిర్వహిస్తున్న అధికారులు

నందికొట్కూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆంజనేయ, మల్లేశ్వర స్వామి దేవస్థానాలకు సంబంధించిన భూముల కౌలుకు బహిరంగ వేలం దేవాలయ శాఖ అధికారులు నిర్వహించారు. గురువారం పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయం ప్రాంగణం వద్ద కార్యనిర్వాహక అధికారి సాయి కుమార్, పర్యవేక్షణ అధికారి కార్తీక్ ఆలయాలకు సంబంధించిన 45.95 ఎకరాలు మూడు సంవత్సరాలకు బహిరంగ వేలం వేశారు. ఇందుకు సంబంధించి సంవత్సరానికి రూ.5.7 లక్షల వేలానికి రైతులు దక్కించుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ భాస్కర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు రమారెడ్డి, మురళీధర్‌రెడ్డి, చిన్న పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న ఆటో.. వ్యక్తి దుర్మరణం

ఆత్మకూరురూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న లారీని ఆటో ఢీకొనడంతో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన మండలంలోని నల్లకాలువ గ్రామ శివార్లలో చోటు చేసుకున్నట్లు ఎస్ఐ వెంకట నారాయణరెడ్డి తెలిపారు. వివరాలు.. ఆత్మకూరు పట్టణం వాకిటి పేటకు చెందిన లక్ష్మన్న (23), రాజు, ట్రాన్స్‌జెండర్ రేష్మా బండి ఆత్మకూరు మండలం బోధనం గ్రామంలో పెళ్లి వేడుకకు ఓ ఆటోలో గురువారం రాత్రి హాజరై శుక్రవారం తెల్లవారుజామున 3 గంటలకు తిరిగి ఆత్మకూరుకు బయలుదేరారు. ఆటో మండలంలోని నల్లకాలువ గ్రామ శివార్లలోకి చేరుకోగానే రోడ్డుపై ఆగి ఉన్న లారిని ప్రమాదవశాత్తు ఢీ కొట్టడంతో లక్ష్మన్న అక్కడికక్కడే మృతి చెందాడు. రేష్మా, రాజు, ఆటో డ్రైవర్ ముర్తుజావలికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ వెంకటనారాయణ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అలాగే లారీ డ్రైవర్ వెంకటసుబ్బయ్యను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు. మృతుడు లక్ష్మన్న అన్న శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

పేదల కడుపు నింపుతున్న అన్న క్యాంటీన్

● రూ.5కే భోజనం ● రోజూ 2,450 మందికి సరఫరా



జీజీహెచ్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్

నంద్యాల హాస్పిటల్, మే 23(ఆంధ్రజ్యోతి): అన్నం కోసం అవస్థలు పడుతూ హోటల్‌కు వెళితే జేబులు ఖాళీ అయ్యే ప్రస్తుత పరిస్థితుల్లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేదల కడుపు నింపేందుకు శ్రీకారం చుట్టింది. భోజనం కేవలం రూ.5కే లభించడంతో ఎంతోమంది అనాథలు, పేదలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 2014లో టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన అన్న క్యాంటీన్లకు వైసీపీ ప్రభుత్వం మంగళం పాడింది. మళ్లీ టీడీపీ ప్రభుత్వం పునరుద్ధరించడంతో ఆకలితో అలమటిస్తున్న నిరుపేదలకు అన్నక్యాంటీన్లు వరంగా మారాయి. నాణ్యమైన భోజనం ఇవ్వడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నంద్యాలలో జీజీహెచ్, ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా అన్న క్యాంటీన్లు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్న క్యాంటీన్ల నిర్వహణ బాధ్యత హరేరామ-హరేకృష్ణ ఇస్కాన్ సంస్థకు అప్పగించింది. నంద్యాలలో ప్రతిరోజూ 2450మందికి ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందిస్తున్నారు.

పీఎఫ్ బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌బాబు

ఆత్మకూరు, మే 23(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో కార్మికుల పీఎఫ్ బకాయిలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌బాబు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ప్రతాప్ అన్నారు. శుక్రవారం ఆత్మకూరులోని ఏఐటీయూసీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న కార్మికులకు పీఎఫ్ బకాయిలు చెల్లించకుండా మున్సిపల్ కమిషనర్, చైర్మన్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. దీనివల్ల కార్మికులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని అన్నారు. ఈ విషయంపై అనేకమార్లు మున్సిపల్ అధికారులను సంప్రదించినా స్పందం లేదని మండిపడ్డారు. మున్సిపల్ అధికారులు స్పందించి పీఎఫ్ బకాయిలను వెంటనే కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని లేనిపక్షంలో నిరవధిక నిరాహారదీక్షలు చేపడతామని హెచ్చరించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఆత్మకూరురూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఓ ఇంట్లో చోరీ చోటు చేసుకున్నది. ఈ ఘటన ఆత్మకూరు పట్టణంలోని స్వరాజ్‌నగర్‌లో శుక్రవారం చోటు చేసుకున్నది. ఎస్ఐ నారాయణరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్వరాజ్‌నగర్‌లో నివాసం ఉంటున్న మేజర్ ఇరిగేషన్ శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న మోహన్‌రెడ్డి రెండు రోజుల క్రితం కర్నూలుకు తన వ్యక్తిగత పని నిమిత్తం భార్య, పిల్లలతో కలిసి వెళ్లారు. కాగా శుక్రవారం కర్నూలు నుంచి ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉండటం, ఇంట్లో చిందవందరగా వస్తువులు పడి ఉండటంతో చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్ఐ వెంకటనారాయణ రెడ్డి క్లూస్ టీంతో కలిసి సంఘటనా స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ఇంటి పొరుగు వారిని విచారించారు. రూ. రెండు లక్షల విలువ చేసే బంగారు వస్తువులు, కొంత నగదు దుండగులు దోచుకెళ్లినట్లుసదరు బాధితుడు మోహన్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

ట్రేడ్ యూనియన్ ఏర్పాటుకు కృషి

నందికొట్కూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో ట్రేడ్ యూనియన్‌ను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని నందికొట్కూరు మార్కెట్ యార్డు నూతన చైర్మన్ వీరం ప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మార్కెట్ యార్డు చైర్మన్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను రైతు కుటుంబం నుంచే వచ్చానని, రైతుల సమస్యలు తనకు బాగా తెలుసన్నారు. రైతు పండించిన పంటను అమ్ముకునేందుకు ట్రేడ్ యూనియన్ లేదన్నారు. రైతులు తమ పంటల ఉత్పత్తులను క్రయ విక్రయాలు చేసుకునేందుకు వీలుగా నందికొట్కూరు మార్కెట్ యార్డులోనే ట్రేడ్ యూనియన్‌ను ఏర్పాటు చేసే విధంగా కృషి చేస్తామన్నారు. మార్కెట్ యార్డులో ఉన్న సమస్యలను గుర్తించి సత్వరం పరిష్కరించాల్సి వాటికి చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రతి చిన్నారికి ఆధార్ తప్పనిసరి

నందికొట్కూరు సీనియర్ సివిల్ న్యాయాధికారి శోభారాణి



మాట్లాడుతున్న శోభారాణి

నందికొట్కూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): చిన్న పిల్లలకు వారి తల్లిదండ్రులు ఆధార్ నమోదు చేయించాలని నందికొట్కూరు సీనియర్ సివిల్ న్యాయాధికారి శోభారాణి సూచించారు. శుక్రవారం నందికొట్కూరు కోర్టు ఆవరణలోని మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ హాల్‌లో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలపైన బాధ్యతాయుతంగా ఉండాలని, పిల్లల ప్రవర్తనలో మార్పులను గమనిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మిస్సింగ్ చిల్డ్రన్స్ వివరాలను సీడీపీవో, మండల విద్యాశాఖ అధికారులు, తహసీల్దార్, పోలీసు శాఖల వారు వారి బాధ్యతలను నిర్వర్తించాలన్నారు. జాతీయ లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో సాతి కమిటీని ఏర్పాటు చేసిందని ఈ కమిటీ ఆధార్‌లేని చిన్న పిల్లలకు ఆధార్ నమోదు చేయడం, న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించడం, ఉచిత న్యాయ సహాయం అందించడం ప్రధాన ఉద్దేశమన్నారు. జూలై 5న జాతీయ నేషనల్ లోక్ అదాలత్ నుంచి నందికొట్కూరు కోర్టులో నిర్వహించనున్నట్లు తెలిపారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న క్రిమినల్, సివిల్, ఫ్యామిలీ తగాదాల కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకోవాలని ఆమె సూచించారు. సమావేశంలో సీడీపీవో కోటేశ్వరమ్మ, లేబర్ ఆఫీసర్ షమీర్, న్యాయవాదులు వెంకటరాముడు, వెంకటేశ్వర్లు అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గీతదాటితే వేటు తప్పదు



ప్రధాన రహదారికి ఇరువైపులా వేయించిన మార్కింగ్

వెలుగోడు, మే 23 (ఆంధ్రజ్యోతి): వెలుగోడు పట్టణంలో ప్రధాన రహదారిలో ట్రాఫిక్ సమస్యలు నెలకొన్నాయి. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ సురేశ్ ప్రధాన రహదారికి ఇరువైపులా మార్కింగ్ వేయించారు. దుకాణ దారులకు ప్రత్యేక మార్గదర్శకాలు చేశారు. ఎవరైనా గీతదాటి వ్యాపారాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం ఎస్ఐ పర్యవేక్షించి ప్రధాన సెంటర్‌లో గీత దాటి ముందుకు వచ్చి వ్యాపారాలు చేసిన వారికి జరిమానాలు విధించారు.

డీలర్ల వ్యవస్థ పటిష్టం

- ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన డీలర్లు



సీఎం చంద్రబాబు, మంత్రుల ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న డీలర్లు

కొలిమిగుండ్ల, మే 23 (ఆంధ్రజ్యోతి) : రేషన్ పంపిణీ వ్యవస్థలో డీలర్ల వ్యవస్థను పటిష్టం చేయడం హర్షనీయమని డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు చెన్నారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన డీలర్లు సీఎం చంద్రబాబు, మంత్రులు నాదెండ్ల, బీసీ జనార్దన్‌రెడ్డి చిత్రాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండీయూ ఆపరేటర్ల విధానాన్ని రద్దుచేసిన ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ నమ్మకాన్ని వమ్ము చేయకుండా రేషన్ పంపిణీ చేసి ప్రజలకు మరింత చేరువయ్యేలా కృషి చేస్తామని డీలర్లు అన్నారు. డీలర్లు శివశంకరరెడ్డి, గంగరాజు, నారాయణప్ప, విష్ణువర్ధన్‌రెడ్డి, రామయ్య, దస్తగిరి, శ్రీరాముడు, భూపాల్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, నాగిరెడ్డి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శిశు ఆధార్ సెంటర్లను వినియోగించుకోండి

కొలిమిగుండ్ల, మే 23 (ఆంధ్రజ్యోతి) : కొలిమిగుండ్ల, అవుకు మండలాల్లోని అంగన్‌వాడీ సెంటర్లలో ఏర్పాటు చేస్తున్న శిశు ఆధార్ సెంటర్లను ప్రజలు వినియోగించుకోవాలని శిశు ఆధార్ సూపర్‌వైజర్ మహేంద్ర సూచించారు. 0నుంచి 5సంవత్సరంల లోపు పిల్లలందరికీ ఈసెంటర్లలో ఆధార్ నమోదు చేస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ చిన్నారులకు ఆధార్ తీయించాలన్నారు.

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు

కొలిమిగుండ్ల, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటపాడు, పేరుసోముల గ్రామాల మధ్య నూతనంగా నిర్మించిన పంచవటి అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు శుక్రవారం వైభవంగా ముగిశాయి. వందలాది మంది భక్తజన సందోహం మధ్య సాంప్రదాయ పద్ధతిలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ, యంత్ర, ప్రాణ ప్రతిష్ఠ, బలిప్రదానం, గోదర్శనం, జ్వాలా దర్శనం తదితర పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు.

మోటార్‌సైకిల్ బోల్తా

కొలిమిగుండ్ల, మే 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంకిరెడ్డిపల్లె గ్రామ సమీపంలో మోటార్‌సైకిల్ బోల్తా పడింది. ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. భీమునిపాడు గ్రామానికి చెందిన దూదేకుల పీరయ్య కుమారుడితో కలిసి మోటార్ సైకిల్‌పై తాడిపత్రికి వెళ్తుండగా ప్రమాదవశాత్తు అదుపు తప్పి బోల్తా పడింది. గాయపడిన వారిని 108 వాహనంలో తాడిపత్రి ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

సిద్ధరామేశ్వరస్వామికి తమలపాకు పూజ

కొలిమిగుండ్ల, మే 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బెలుం గ్రామంలో వెలసిన ప్రసిద్ధ పురాతన సిద్ధరామేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మహేష్‌శర్మ సోదరుల ఆధ్వర్యంలో స్వామివారికి తమలపాకుల పూజ, అభిషేకాలు, విశేష అర్చనలు నిర్వహించి, ప్రత్యేక అలంకరణగావించారు. మరో వైపు గ్రామంలోని సత్యమ్మ, పెద్దమ్మ తదితర గ్రామ దేవతల ఆలయాల్లోనూ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రిజర్వాయరుకు చేరుతున్న నీరు



తెలుగుగంగ ప్రధాన కాల్వలో రిజర్వాయరు వైపు తరలివెళ్తున్న నీరు

రుద్రవరం, మే 23 (ఆంధ్రజ్యోతి): నల్లమల అడవిలోని తుండ్ల వాగు రిజర్వాయరుకు నీరు చేరుతోంది. 'రిజర్వాయర్‌కు నీటి మట్టం అడుగంటు తుంది' అనే శీర్షికన ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. తెలుగు గంగ అధికారులు స్పందించారు. నీటిని విడుదల చేశారు. తుండ్లవాగు రిజర్వాయరలో నీటి మట్టం పెరిగితే హరినగరం తాగునీటి పథకానికి నీటి కొరత ఉండదు.

యోగా శిక్షణకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

ఉయ్యాలవాడ, మే 23 (ఆంధ్రజ్యోతి): యోగా శిక్షణకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎంపీడీవో ఉమామహేశ్వర్‌రావు శుక్రవారం తెలిపారు. జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర అనే కార్యక్రమం ప్రారంభించిందన్నారు. ఇందులో భాగంగా ప్రతి సచివాలయానికి 200మంది చొప్పున యోగాంధ్ర యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. శిక్షణ అనంతరం గ్రామస్థాయిలో యోగా నేర్పించనున్నట్లు తెలిపారు.

హుసేనయ్య స్వామికి ప్రత్యేక పూజలు

రుద్రవరం, మే 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుమ్మకొండ హుసేనయ్యస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. హుసేనయ్య స్వామికి జెండాను, బిందె నీటిని కొండపైకి తీసుకెళ్లి జెండాను చెట్టుకు కట్టి నీటిని ఆరబోసి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే కింద ఉన్న దర్గా వద్ద పూజలు చేశారు. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి హుసేనయ్య స్వామిని దర్శించుకున్నారు.

కన్యకాపరమేశ్వరికి అభిషేకాలు

రుద్రవరం, మే 23 (ఆంధ్రజ్యోతి): రుద్రవరంలో కొలువుదీరిన కన్యకాపరమేశ్వరి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అమ్మవారికి అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. తరలివచ్చిన ఆర్యవైశ్యులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

చౌడేశ్వరికి ప్రత్యేక పూజలు

రుద్రవరంలో కొలువుదీరిన చౌడేశ్వరి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. మహిళలు బోనాలు చీరలు సమర్పించారు.

నిలిచిన భవన నిర్మాణం

- పిల్లర్లకే పరిమితమైన సచివాలయం



జలదుర్గంలో అర్థాంతరంగా నిలిచిన సచివాలయ భవనం

ప్యాపిలి, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జలదుర్గం గ్రామంలో రూ.లక్షలతో చేపట్టిన సచివాలయ భవనం పిల్లర్లకే పరిమితమైంది. మూడేళ్లుగా నిర్మాణం పనులు పూర్తిగా నిలిచిపోయాయి. గ్రామంలో వైసీపీ ప్రభుత్వంలో రూ.35లక్షలతో సచివలయ భవనం నిర్మాణం పనులను చేపట్టారు. పిల్లర్ల వరకు భవనం నిర్మాణం పనులను పూర్తి చేశారు. అధికారులు పనులు పూర్తి చేసిన వరకు బిల్లులు చెల్లించలేదు. దీంతో కాంట్రాక్టర్ పనులు చేయలేనంటూ చేతులెత్తేశాడు. దీంతో మూడేళ్లుగా భవన నిర్మాణ పనులు పిల్లర్లకే పరిమితమయ్యాయి. ప్రస్తుత ప్రభుత్వమైనా అర్థాంతరంగా నిలిచిపోయిన సచివాలయ భవనానికి నిధులు మంజూరు చేసి పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నరకయాతనే..

- ఐదేళ్లగా ముందుకు సాగని రెండు వరుసల రోడ్డు పనులు
- ఇబ్బందుల్లో వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

రుద్రవరం, మే 23(ఆంధ్రజ్యోతి) : ఐదేళ్ల క్రితం ప్రారంభించిన రెండు వరుసల రహదారి పనులు పూర్తికాకపోవడంతో ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. మండలంలోని నరసాపురం నుంచి ప్రారంభించిన రెండు వరుసల రహదారి పనులు అసంపూర్తిగా ఉన్నాయి. 2020 అక్టోబరు 16న ఈ రహదారి పనులు ప్రారంభించబడ్డాయి. ఇరవై ఏడు కిలో మీటర్ల మేర ఈ రోడ్డు నిర్మించడానికి సీఆర్ఎఫ్ నిధులు రూ.33.50 కోట్లు మంజూరయ్యాయి. వైసీపీ హయాంలో ఈ పనులు ప్రారంభమై అసంపూర్తిగా నిలిచాయి. అప్పటి ప్రభుత్వం రహదారి పనులను నిర్లక్ష్యం చేయడంతో వాహనదారులకు శాపంగా మారింది. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.



రుద్రవరం ఉన్నత పాఠశాల వద్ద గోతులు తవ్వి వదిలివేసిన ఆర్అండ్‌బీ రోడ్డు



రుద్రవరం తహసీల్దారు కార్యాలయ సమీపంలో..

అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకో లేదు. అలాగే నరసాపురం, తిప్పారెడ్డిపల్లె గ్రామాల మధ్య కల్వర్టు పనులు అసంపూర్తిగానే వదిలేశారు. అలాగే వదిలేయడంతో ఇది ప్రమాదకరంగా మారాయి. ఈ రహదారిలో పుణ్యక్షేత్రాలకు వెళ్లే వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. అహోబిళం నుంచి మహానంది, శ్రీశైలం, ఇక్కడ నుంచి అహోబిళం, తిరుపతి, ఇంకా పలు క్షేత్రాలకు వెళ్లే వాహనాల రాకపోకలు అధిక సంఖ్యలో ఉంది. ఆర్అండ్‌బీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. వాహనాల్లో వెళ్లే యాత్రికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు అసంపూర్తిగా ఉన్న రహదారి నిర్మాణంపై దృష్టి సారించాలన్నారు.



కూలిన కల్వర్టు

వాహనదారులకు తప్పని ఇబ్బందులు

ఆర్అండ్‌బీ రహదారిలో భాగంగా తిప్పారెడ్డిపల్లె సమీపంలో కల్వర్టు కూలిపోయింది. కూలిన కల్వర్టు ప్రమాదకరంగా మారింది. అధికారులు మాత్రం పట్టించుకోలేదన్న విమర్శలున్నాయి. గ్రామం వద్దనే కూలిపోవడంతో ఈ కల్వర్టు ప్రమాదాలకు దారి తీస్తుందని స్థానిక గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.

రోడ్డు పనులు ప్రారంభిస్తాం

రుద్రవరం మండలంలోని నరసాపురం నుంచి అసంపూర్తిగా నిలిచిన రెండు వరుసల రహదారి పనులు ప్రారంభిస్తాం. త్వరితగతిన పూర్తిచేసి వాహనదారుల ఇక్కట్లు తీరుస్తాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలో పనులు ప్రారంభిస్తాం.

- మదనగోపాల్, ఏఈ, ఆర్అండ్‌బీ

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి

ప్రతిపాదనలు సిద్ధం చేయండి

- మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి
- పట్టణంలో పర్యటన

కోవెలకుంట్ల, మే 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం పట్టణంలో మంత్రి సుడిగాలి పర్యటన చేశారు. పట్టణంలోని పలు వీధుల్లో అధ్వానంగా ఉన్న డ్రైనేజీలను పరిశీలించారు. ముఖ్యంగా సాయినగర్, ముదివేడు రోడ్డు నుండి వెటర్నరీ హాస్పిటల్, ఎస్‌బీ కాలనీ నుంచి సంతపేట వరకు అమ్మవారిశాల వరకు సుమారు రూ.2కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వారం రోజుల్లోపు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభించి మూడునెలల్లో పూర్తి చేసే విధంగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని మంత్రి సూచించారు. సక్రమంగా డ్రైనేజీ సరఫరాకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



డ్రైనేజీని పరిశీలిస్తున్న మంత్రి జనార్దన్ రెడ్డి

మినరల్ వాటర్ ప్లాంటు నిర్వహణపై ఆగ్రహం

సంతపేటలో ఉచిత మినరల్ వాటర్ ప్లాంటు నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండడంపై మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటర్ ప్లాంటు నిర్వహణ సక్రమంగా లేకపోవడం, ప్లాంటు లోపలి భాగాలు తుప్పు పట్టడం, వాటర్ ప్లాంటు పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడం చూసి అసహనం వ్యక్తం చేశారు. అనంతరం వాటర్ ప్లాంటులోని నీటిని మంత్రి స్వయంగా తాగి పరిశీలించగా స్వచ్ఛంగా లేకపోవడంతో ఇలాంటి నీరు ప్రజలు ఎలా తాగుతారని అధికారులపై మండిపడ్డారు. వాటర్ ప్లాంటు అపరిశుభ్రంగా ఉండడంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయంత్రంలోపు వాటర్ ప్లాంటును శుభ్రం చేసి తనకు ఫొటోలు పంపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెనుగొండ రాజశేఖర్, మురళీ, గడ్డం అమర్‌నాథరెడ్డి, పంచాయతీరాజ్ డీఈ నాగశ్రీనివాసులు, ఎంపీడీవో వర ప్రసాదరావు, డిప్యూటీ ఎంపీడీవో ప్రకాశ్‌నాయుడు, పీఆర్ ఏఈ చెంచయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయి కుమార్‌రాజ్, సచివాలయ సిబ్బంది, పంచాయతీకార్యదర్శులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులు వాడాలి

బనగానపల్లె, మే 23 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువులు వాడి పెట్టుబడులు తగ్గించుకోవాలని యాగంటిపల్లె కృషి విజ్ఞానకేంద్రం హెడ్, శాస్త్రవేత్త ధనలక్ష్మి సూచించారు. శుక్రవారం కృషి విజ్ఞానకేంద్రంలో మహానంది వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ విజయలక్ష్మి, ప్రొఫెసర్ గీతశిరీష, డాక్టర్ వి.శివజ్యోతి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులకు సేంద్రియ ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలన్నారు. దీని వల్ల నేల సారం పెరుగుతుందన్నారు. మృత్తికా శాస్త్రవేత్త రమణయ్య మాట్లాడుతూ రైతు ప్రతి మూడేళ్లకోసారి మట్టి పరీక్షలు నిర్వహించి వాటి ఆధారంగా ఎరువులు వాడాలన్నారు.



మాట్లాడుతున్న కేవీకే హెడ్ ధనలక్ష్మి

మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి మాట్లాడుతూ పచ్చి రొట్టె ఎరువులు, జీవన ఎరువలు ఆవశ్యతపై వివరించారు. సమావేశంలో యాగంటిపల్లె తమడపల్లె రైతులు పాల్గొన్నారు.

వైభవంగా అభయాంజనేయుడి విగ్రహ ప్రతిష్ఠ



అభయాంజనేయుడికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సంజామల, మే 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరుసోమల సమీపంలో కోటపాడు బస్టాండు వద్ద వెలిసిన ఆలయంలో అభయాంజనేయుడి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. శుక్రవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి వేద పండితులు యంత్ర విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. సంజామల, కొలిమిగుండ్ల మండలాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. మూడు రోజుల నుంచి ప్రారంభమైన విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి.

వైభవంగా మద్దిలేటి స్వామికి తిరుచ్చిసేవ



ప్రత్యేక పల్లకిలో స్వామి, అమ్మవార్ల ఊరేగింపులో వేద పండితులు, ఆలయకమిటీ సభ్యులు

బేతంచెర్ల, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులో వెలసిన మద్దిలేటి స్వామి క్షేత్రంలో శుక్రవారం రాత్రి తిరుచ్చి సేవ వైభవంగా నిర్వహించారు. అర్చకులు ఉదయం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఈవో రామాంజనేయులు సమక్షంలో తిరుచ్చి వేడుకలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రత్యేక పల్లకిలో ఏర్పాటు చేసి ఆలయ మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వేద పండితులు అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

బేతంచెర్ల, మే 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దుర్గాపేటలో వెలసిన వేంకటేశ్వరస్వామి దేవాలయం 12వ వార్షికోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయని ఆలయ కమిటీ అధ్యక్షుడు మద్దయ్య శుక్రవారం తెలిపారు. భూదేవి శ్రీదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు హాజరై జయప్రదం చేయాలన్నారు. అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమాలు విజయవంతం చేసేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

కోవెలకుంట్ల, మే 23 (ఆంధ్రజ్యోతి): పొదుపు మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం అందించే వివిధ రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డీఆర్‌డీఏ వెలుగు వైబీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని వెలుగు కార్యాలయంలో పొదుపు మహిళలు కోవెలకుంట్ల క్లస్టరు పరిధిలోని ఏడు మండలాలకు చెందిన వెలుగు సిబ్బందితో సమీక్షా సమావేశం ఏపీఎం శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో బ్యాంకు లింకేజీ డీబీఎంఐబీ క్రిష్ణమూర్తి, కోవెలకుంట్ల క్లస్టర్ ఏసీ గురుస్వామి శ్రీనిధి, ఏజీయం నాగేంద్రప్రసాద్ కోఆర్డినేటరుశివ, చిన్నరాముడు, ఏడు మండలాల చెందిన సీసీలు మహిళలు పాల్గొన్నారు.

ధ్రువపత్రాలు మంజూరు చేయండి

ఉయ్యాలవాడ, మే 23 (ఆంధ్రజ్యోతి): అర్హులైన గృహ నిర్మాణదారులకు ధ్రువపత్రాలు మంజూరు చేయాలని తహసీల్దారు శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం తహసీల్దారు కార్యాలయంలో ఆయా గ్రామాల వీఆర్వోలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో హౌసింగ్ ఏఈ నరసింహరావుతో కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణ లబ్ధిదారులకు కుల, ఆదాయ, పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలన్నారు. ధ్రువపత్రాల మంజూరు విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు ప్రసాద్‌బాబు, ఆర్ఐ అంకన్న, హౌసింగ్‌సిబ్బంది ఉన్నారు.

నేరాల నియంత్రణే లక్ష్యం: సీఐ



హుసేనాపురంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ప్యాపిలి, మే 23 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణే పోలీసు లక్ష్యమని సీఐ వెంకటరామిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని హుసేనా పురం గ్రామంలో కార్డన్‌సెర్చ్ ఆపరేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నేర చరిత్ర కలిగిన పలువురి ఇళ్లను పోలీసులు తనిఖీలు చేశారు. అనంతరం గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ప్రజలు గొడవలకు పాల్పడకుండా ప్రశాంతంగా జీవించాలన్నారు. గ్రామంలో ఎటువంటి సమస్య వచ్చిన పోలీసుల దృష్టికి తీసుకరావలన్నారు. నాటుసారా, మట్కా, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. అంతకు ముందుగా సీఐ ఆధ్వర్యంలో పోలీసులు గ్రామంలో కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐలు మధుసూదన్, నాగార్జున, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'చలో సిద్ధేశ్వరం' విజయవంతం చేద్దాం



యాగంటిపల్లెలో కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

బనగానపల్లె, మే 23(ఆంధ్రజ్యోతి): చలో సిద్ధేశ్వరం ప్రజా బహిరంగ సభను విజయంతం చేయాలని యాగంటి బసవేశ్వర రైతు సంఘం కార్యదర్శి కొండారెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని యాగంటిపల్లె, రాళ్లకొత్తూరు గ్రామాల్లో రైతులను కలిసి సిద్ధేశ్వరం అలుగు ఆవశ్యకతను వివరించి కరపత్రికను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 31న రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో సంగమేశ్వరంలో నిర్వహించే ప్రజాబహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. రైతులకు సంబంధించి సాగునీటి హక్కులు, సిద్ధేశ్వర్యం అలుగు ఆవశ్యకత, గోరుకల్లు భద్రత ఆవశ్యకతను గురించి ప్రజలకు ఆయన వివరించారు. ఎస్సార్బీసీ ఆయకట్టును పరిరక్షించాలని కోరారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ

చాగలమర్రి, మే 23 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని నాల్గొవ ఎంపీటీసీ పరిధిలోగల టీడీపీ నాయకుడు జెట్టి నాగరాజు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న టీడీపీ ఆళ్లగడ్డ నాయకుడు భార్గవ్‌రామ్ శుక్రవారం జెట్టి నాగరాజు నివాసానికి వెళ్లి పరామర్శించారు. రోడ్డు ప్రమాద సంఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్సలు పొంది కోలుకోవాలని ఆకాక్షించారు. ఆయన వెంట టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా, టీడీపీ నాయకులు ఆవుల ప్రతాప్, రాజేంద్ర, ఫరూక్, మోదిన్, గఫార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'పది' సప్లిమెంటరీ పరీక్షలు

చాగలమర్రి, మే 23 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పది సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నట్లు చీఫ్ సూపరింటెండెంట్ శాస్త్రి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సైన్స్ పరీక్షకు 103 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 82 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీవో జయన్న, ఇన్విజిలేటర్లు పాల్గొన్నారు.

ఉపాధి ఎఫ్ఏ సస్పెన్షన్

చాగలమర్రి, మే 23 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలో ఉపాధి ఎఫ్ఏను సస్పెండ్ చేస్తూ కలెక్టర్, ఉపాధి పీడీ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఏపీవో ఖాసీం శుక్రవారం తెలిపారు. గ్రామంలో ఉపాధి ఎఫ్ఏ కూలీలకు పనిదినాలు కల్పించడంలోను, విధుల పట్ల అలసత్వం వహించడంతో సస్పెన్షన్ చేసినట్లు వారు పేర్కొన్నారు. కొత్త ఎఫ్ఏగా నియమించే వరకు సంబంధిత టీఏ ఎఫ్ఏగా కూడా బాధ్యతలు నిర్వహిస్తారని తెలిపారు. కొత్తగా నియమితులైన ఎఫ్ఏలు మస్టర్లు సక్రమంగా నిర్వహించాలని, కూలీల సంఖ్య పెంచాలని సూచించారు.

డీలర్‌కు షోకాజ్ నోటీసు

చాగలమర్రి, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోడెండ్లపల్లె గ్రామానికి చెందిన రేషన్ డీలర్‌కు షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల రేషన్ దుకాణాన్ని తనిఖీ చేసి సంబంధిత రికార్డులను, స్టాక్‌ను పరిశీలించామని అన్నారు. స్టాక్ వివరాలు సరిగా లేకపోవడంతో డీలర్‌పై ఆర్డీవోకు నివేదికలు అందజేశామన్నారు. ఆర్డీవో స్పందించి షోకాజ్ నోటీసు జారీ చేశారని తహసీల్దారు తెలిపారు.

ఘనంగా పల్లకీ ఉత్సవం

బనగానపల్లె, మే 23(ఆంధ్రజ్యోతి): నందవరం చౌడేశ్వరీ మాత ఆలయంలో శుక్రవారం అమ్మవారి పల్లకీసేవ సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. ఈవో కామేశ్వరమ్మ, ఆలయ కమిటీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డి, పూజారుల ఆధ్వర్యంలో అమ్మవారిని పల్లకీలో అమ్మవారిని ఊరేగించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక మొక్కులు తీర్చుకున్నారు.

విద్యుదాఘాతంతో రెండు బర్రెలు మృతి

కోవెలకుంట్ల, మే 23 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో రెండు బర్రెలు మృతి చెందాయి. ఈ ఘటన మండలంలోని కలుగొట్లలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బండి ఆత్మకూరు రాముడు, బాలశేఖర్‌కు చెందిన రెండు బర్రెలు గురువారం ఇంటి నుంచి బయటికి వెళ్లి రాత్రి అయినా రాకపోవడంతో శుక్రవారం పొలాలకు వెళ్లి బర్రెలను వెతుకగా కలుగొట్ల నుంచి జోలధరాశికి వెళ్లే పొలాల్లో విద్యుత్ తీగలు తగిలి బర్రెలు మృతి చెందాయి. ప్రమాదవశాత్తు మృతి చెందిన బర్రెలకు నష్టపరిహారం అందించాలని బాధితులు కోరారు.

నేటి నుంచి ఉరుసు



దివాన్‌షా ఖాద్రి దర్గా

బేతంచెర్ల, మే 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వెలసిన హజరత్ మహ్మద్ దివాన్‌షా ఖాద్రి ఉరుసు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయని దర్గా ముజావర్ సయ్యద్ నిసార్ అహ్మద్ శుక్రవారం తెలిపారు. శనివారం రాత్రి గంధం, ఆదివారం ఉరుసు , సోమవారం జియారత్ కిస్తీలు ఉంటాయని ఆయన తెలిపారు. ఉత్సవాలను విజయవంతం చేసేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలిరావాలని ఆయన కోరారు.

నేడు ఆలయ భూముల వేలం

దొర్నిపాడు, మే 23 (ఆంధ్రజ్యోతి): చాకరాజువేముల గ్రామంలో వెలసిన గౌరి భోగేశ్వరస్వామి, లక్ష్మీచెన్నకేశవస్వామి దేవస్థానానికి చెందిన భూములను శనివారం వేలం నిర్వహిస్తున్నట్లు ఎండోమెంట్ అధికారి బాలచెంచన్న తెలిపారు. భోగేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి 40 ఎకరాలు, లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయానికి సంబంధించిన 44.14 ఎకరాలకు వేలం వేస్తున్నట్లు తెలిపారు. రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. ఆసక్తి గల రైతులు పాల్గొనాలని కోరారు.